ఆహత జ్వాల

శ్రీ 'కొలకలూరి'

వెంకటేశం ఉలిక్కిపడి నిద్రలేచి నిలబడ్డాడు. నిలవలేనంతగా వణికిపోతున్నాడు. శరీరం విపరీతంగా సంచలించిపోతూ వుంది. గాలి దుమారానికి పూరిపాక వూగిసలాడినట్లు వూగిపోతున్నాడు.

ముఖం నిండా చెమటపట్టింది. చెమట బొట్లు వెంట్రుకలనుండి పసివాడి కన్నీటి బిందువులలాగా కదులుతున్నాయి. ఫేన్ తిరుగుతూవున్నా చెమట ఆరిపోవటం లేదు. అధికమౌతూ వుంది. తలలో ఎక్కడో పుట్టిన చెమటబొట్టు పడగ ఎత్తిన పాములాగా చెవి ప్రక్కగా క్రిందికి దిగుతూ వుంది. కంఠం మీదికివచ్చి, ముందుకు పోలేక భయంగా ఆగిపోయింది.

ఎదుట రోడ్డుకు అవతల హాస్పటల్ గుండెవంటి టవర్‌క్లాక్ మూడు గంటలు చూపుతూ కొట్టుకొంటూ వుంది. మే నెల రాత్రి తెల్లవారుజాము మెట్టప్రాంతంలో తొలి చల్లని గాలి స్పర్శకు సుఖంగా ఒడలుమరచి నిద్రపోతున్న ప్రాణి సమూహం రోడ్డుకు రెండు ప్రక్కలా ఎవరి దృష్టినయినా ఆకర్షిస్తుంది.

వెంకటేశం వేసవిరాత్రి నిద్రసుఖం తెలియనివాడుకాదు. పన్నెండుగంటలకు లోపలికి వచ్చి, హాలులో నిలబడి ఎగదొప్పుతూ, కుర్చీలు బోర్లించిన టేబుళ్ళమధ్య, క్రింద గోనెపట్టలో చుట్టిన సన్నటిపరుపు విప్పుకొని పడక సిద్ధం చేసుకొని, కోటినీ, నాగలింగంనీ ప్రక్కనే పడుకోబెట్టుకొని, తలుపులు కిటికీలు మూసి, బోల్టులుపెట్టి, లైటు ఫేను వేసుకొని నిద్రపోబోయి, నిద్రపట్టక పడకఅంతా పొర్లాడి, కొట్టుకొని, చివరకు కునుకుపట్టి, ఆకస్మికంగా మెలకువవచ్చి, వణుకుతూ, చెమటలో తడిసిపోతూ నిలుచున్నాడు వెంకటేశం.

చెరోప్రక్క కోటి, నాగలింగం పడుకొనేవున్నారు. నిద్రపోతూనేవున్నారు. అంతగా చెమటపట్టలేదు. అసలు కదలికే లేదు. కిటికీతీసి చూశాడు వెంకటేశం. ఎదుట లైటుస్తంభం క్రీనీడలో పడుకొన్నకుక్క లేచి, వళ్ళు విరిచించుకొని, గోడ ప్రక్కగా జరిగి కాళ్ళువిదిలించుకొని, బార్లా జాపుకొని పడుకొంది. కుక్కల అరుపులూ పోలీసుల విజిల్సు దూరంగా వినబడుతుంటే, కుక్క, శరీరం కదలకుండా తలమాత్రం ఎత్తి, అనాసక్తంగా చూచి, తలవాల్చుకొని, నిద్రలో కూరుకుపోయింది. బల్బు వెలుతురుచుట్టూ, రాత్రిఅంతా ఎన్నోరాత్రులనుంచి తిరుగుతున్న పురుగులు వెలుతురు వలయంలో, చీకటిలోనుంచి వచ్చి, సంతోషం కలుగుతుందన్న ఆశతో పరిభ్రమిస్తున్నాయి. వెలుతురు అందదు. ఆశ తీరదు.

జనతా హోటల్‌ముందు ఫుట్‌పాత్‌మీద నవారుమంచం మీద పడుకొన్న లావుపాటి వ్యక్తి సుబ్బారావు నిద్రలేచాడు. సుబ్బారావు హోటల్ ఓనర్ కమ్ మేనేజర్ కమ్ కేషియర్. హోటల్ మెయిన్ గేట్ మూసివుంటే అటూ ఇటూ చూచి తలుపుతట్టాడు వెంకటేశం తీసి, అటూ ఇటూ చూచి లోపలె వణుకుతూ వున్నాడు

కిచిన్‌లోకి పోయి, ముఖంమీద నీళ్ళు జల్లుకొని లుంగీ పంచతో తుడుచుకొని లైటువేసి, వేంకటేశ్వరస్వామి పటానికి నమస్కరించి, గోడగడియారం వైపుచూచి తిట్లు ప్రారంభించాడు.

'లెండ్రా వెధవల్లారా! కునుకిట్లాడుతా వేంటిరా గాడిద కొడకా! లేరా దొంగనాయాల! లెండెహె! హోరి కోటీ లేవండరా! నాగలింగం హోయి నాగలింగం లేరా బాబూ! లే!— ఇంకా నిద్దరబోతన్నార్రా దొర్లు!'

సుబ్బారావు హాలులోకీ వెలుపలికీ తిరుగుతూ అందరినీ నిద్రలేపుతున్నాడు జనతముందు క్లీనర్లు పడుకొన్నారు. చెంగాయి దోసెడంతయి వున్నాడు. క్లీనర్లు అందరిలో చిన్నవాడు. సుబ్బారావు లేరా అంటూ కాలుతో కదిపాడు చెంగాయి ఉలిక్కిపడి లేచి, కళ్ళునులుముకొంటూ, అటూ ఇటూ చూచి ఆవులించి, వణుకుతూ నిలబడ్డారు.

'పందులు! పందులు గాడిదకొడుకులు! ఎగబడి దింటావే గానీ పనింటంలేదు గందా!' సుబ్బారావు మేలుకొలుపు—వైతాళిక గీతి—ఆలపిస్తూనే వున్నాడు. అంతదురుసుగా ఆ మధ్య ఎప్పుడూ ప్రవర్తించలేదు. అతనికి తన హోటల్‌లో పనిచేసే అందరికీ

ఇంత తిండితిప్పలుపెట్టి పోషిస్తున్నానన్న అహంకారం వుంది. ఆ అందరూ తనకంటే తక్కువ అన్న భావమూ వుంది. వెంకటేశం విషయంలోమాత్రం భిన్నంగా వుంటాడు. అయితే ప్రతిపని వాడూ ఒకపంది అనీ, వెంకటేశం ప్రబుద్ధవరాహావతారం అనీ అభిప్రాయం. అయితే బైటికా మాట అనడు.

సుప్రభాతం ముగించి లోపలికి వస్తూ తన పడకమీద కూర్చున్న వెంకటేశంవైపు పరీక్షగా చూశాడు సుబ్బారావు. కోటి నాగలింగం పడకలు చుట్టుకొని లేచి లోపలికిపోయారు. వెంకటేశం ముఖంమీద చెమట తుడుచుకొన్నాడు. అంతగా చెమటలేదు! వణుకుకూడా తగ్గింది. ముఖం నల్లగా అయిపోయింది. కళ్ళు, నూనెలేక వత్తిఎండి ఆరిపోబోతున్న ప్రమిదలులాగా వున్నాయి.

'యేందిరా యెంకటేశం యేందిది? యేందిట్టుండా?'

వెంకటేశం ఏమీ మాట్లాడలేదు. గోళ్ళు గిల్లుకొంటూ కూర్చున్నాడు. సుబ్బారావు కంగుతిన్నట్లు అయిపోయాడు. అసలు పలకరించటానికి కారణం లేకపోలేదు. సుబ్బారావు, ఎవరినయినా, ఎప్పుడయినా, దురుసుగా నోరు జారితే వెంకటేశం వూరుకోడు. వూరుకోవటం సహించలేక పలకరించాడు.

'వారే యెంకటేశం! మాట్లాడవేందిరా! యేందసలి సంగతి! యెపుడన్నా యావన్నా అంటె జెప్పరావేంటరా!'

'ఏమీ లేదు!'

సుబ్బారావు కిచిన్‌లోకి నడిచాడు. చెంగాయి హాలు తుడుస్తున్నాడు. ఇంక ఇద్దరు పిల్లలు—ఒకడు నీళ్ళు జల్లుతుంటే, మరొకడు గోనెపట్టెలో తడి తుడుస్తున్నాడు. స్పెషల్ గదుల ప్రక్కనుంచి తమపని—త్రిమూర్తుల కార్యక్రమం—ప్రారంభించారు.

హాస్పటల్ టవర్‌క్లాక్ నాలుగు కొట్టింది. క్లీనర్ బక్కెట్ నిండా నీళ్ళు తెచ్చి, బోర్నవిటా టిన్నుముంచి నీళ్ళు జల్లుతున్నాడు, హోటల్ ముందు తాటాకు పందిరిక్రింద, దుమ్మురేగకుండా, అణిగి వుండేటందుకు. చెంగాయి కొబ్బరీనెల చీపురుతో హాలంతా వూడుస్తున్నాడు. వెంకటేశం ఇంకా లేవలేదు.

'అన్నా! అన్నా!'

'ఏమిటిరా!'

'యేందింకా లెక్కుండా కూసునే వుండా!'

'వస్తున్నాను లేరా!'

చెంగాయి వూడ్చినంతవరకు నీళ్ళు జల్లారు తుడిచారు పిల్లలు! కోటి నాగలింగం వెలుపలినుంచి వచ్చారు. వెంకటేశం అందరికంటే ముందుగా నిద్రలేవాడు అందరూ లేచి పని చేసుకొంటున్నా కదలకుండా కూర్చున్నాడు. వణకటం లేదు. చెమట లేదు. నిస్సత్తువగా కూర్చున్నాడు. చలనం లేదు. కానీ కళ్ళలోమాత్రం నీళ్ళు కదులుతున్నాయి.

అక్కడున్న అందరూ చూశారు. వాళ్ళు మునుపు అతని కన్నీళ్ళు చూళ్ళేదు వాళ్ళకు వెంకటేశం తీరు వింతగా వుంది. బాధ కలిగింది. దిగులుగా ఏందంటే ఏందన్నారు. ఏమీ లేదని బాధగా చెప్పి, బాధపడవద్దని సముదాయించి, లేచి, పడక మడచి, కళ్ళు తుడుచుకొని, పడక లోపల పడేసి, వేపపుల్ల తీసుకొని, కొసకొరుకుతూ వెలుపలికి నడిచాడు. పిల్లలు త్రిమూర్తులు తుడుపు కార్యక్రమం బాధ్యతాయుతంగా నిర్వహిస్తున్నారు. కిచిన్‌లోంచి పొగ బయలుదేరింది. సుబ్బారావు, అరిగిపోయిన పాతరికార్డుల సంగీతంతో పట్నం రక్తంలో ఒక ప్రక్కనుంచి చైతన్యం సాధిస్తున్నాడు.

వేపపుల్లో పళ్ళపొడో తీసుకొనివెళుతున్నవాళ్ళు తను ఇచ్చే ధర్మం స్వీకరించేవాళ్ళలాగా కనిపిస్తున్నారు సుబ్బారావుకు. కాఫీతాగి బిల్లు చెల్లించేవాళ్ళు 'బ్రతికిపో' అన్నట్లుగా డబ్బు బిల్లుముఖాన గిరవాటు పెట్టినట్లుగా వెళుతున్నారు. ఏమి స్వభావాలో!?

వెంకటేశం ముఖం కడుక్కొని చేతులు తుడుచుకొంటూ లోపలికి వస్తుంటే హోటల్—కేషియర్, సాంబ్రాణి పొగ, రికార్డులతంతు, లోపలనుంచి కమ్మనితావులు—వేశ్యలాగా అలంకరించుకొని వీధిలో నిలబడి, లోవనుపోయేవాళ్ళను పలకరించి, పలికినవాళ్ళను పిలుస్తున్నట్లుగా వుంది, అనిపించింది.

వెంకటేశం లోపలికి వచ్చేసరికి హాలు శుభ్రంగా వుంది. రాత్రి టేబుళ్ళమీద బోర్లాపడుకున్న కుర్చీలు వెల్లకిలగా, రొమ్ము విరగదీసుకొంటూ గర్వంగా కూర్చున్నాయి. స్పెషల్ గదులు రెండూ సరిచేయబడ్డాయి. క్రింది తడి ఆరిపోయింది. కిచిన్ ముక్కుపుటాలకు విందు చేస్తూవుంది. ఒకరొకరే రాసాగారు. కుర్చీలు మూలుగుతూ ఒప్పుకొంటున్నాయి. ఒక్క మనిషి కాఫీకి ఆర్డరిస్తే పెక్కుచోట్ల ధ్వనీ, పంచలనం బయలుదేరుతున్నాయి.

వెంకటేశం వయస్సు పాతికకు ఒకటి అటో ఇటో ఉండవచ్చు. పుట్టింతేదీ మాత్రమేకాదు సంవత్సరమేదేని మనుష్యులు ఈ దేశంలో ఎక్కడచూచినా వున్నారు. మనిషి ఎత్తు! లావు! భారీవిగ్రహం! వయస్సుకు వయ్యారం తెచ్చే గుణం సహజం! అందువల్ల బాగా వున్నాడని ఎవరయినా అనుకొంటే అనుకోనూ వచ్చు! అతని కళ్ళలో ఏదో మంట ఉన్న

ట్లుగా వుంటుంది. ఆ మంట ముఖంఅంతా వెలుతురు చిమ్ముతూ వుంటుంది. ఎక్కడో హృదయంలో గుండెలో పొయ్యివుండి వుంటుంది. ఆ పొయ్యి ఆరిపోదు. ఈ మంట చల్లారదు. పైగా రోజురోజుకూ ఎక్కువవుతూ వుంది.

అటువంటి వెంకటేశం ఆ రోజు వరదవచ్చి తగ్గిపోయిన ఏరులా, కాలిఆరిపోయిన కొంపలా, మండిబూడిదయిన కట్టెలా, ప్రాణంలేని మనిషిలాగా వున్నాడు. ఎందుకిలా వున్నాడో ఎవరికీ తెలియదు! అతనికి తెలియవచ్చు!

జనతలోకి జనం రాసాగారు. వచ్చినవాళ్లు కావలసింది చెబితే ఉన్నదిచ్చి సేవించింతర్వాత బిల్లురాసి ఇస్తున్నాడు వెంకటేశం. హాలులో రెండు టేబుళ్లు స్పెషల్ రూంలలో నాలుగు టేబుళ్లు అతని వంతు!

ఒక ముసలాయన వచ్చి టేబిల్‌మీద తల పెట్టుకొని కూర్చున్నాడు. వెళ్లి, 'ఏం కావాలి?' అని పలకరించినా మనిషి తలెత్తలేదు లోపల్నుంచి కాఫీ కపులు తెస్తున్నప్పుడు కళ్లొత్తుకొంటూవున్న ముసలాయన ముఖం చూచీ చూడటం లోటే జ్వరం వచ్చినట్లు అయింది. అక్కడికి పోలేకపోయాడు.

'బాబూ! కాఫీ యిత్తా?' అంటూ పలకరించాడు ముసలాయన. అవుననకుండా లోపలికిపోయి కుక్‌తో 'నటేశం! మంచి కాఫీ! ఫస్ట్‌క్లాస్ కాఫీ! ఫస్ట్ అంటే ఫస్ట్! ఇవ్వు!' అన్నాడు. అరవ భాష ఊనికతో తెలుగు పలికే నటేశం వెంకటేశంతో 'ఏమి సంగది?' అంటూ కాఫీ కలిపి ఇచ్చాడు. ముసలాయనకు కాఫీ ఇచ్చి అటు తిరుగగానే కళ్లవెంట నీళ్లు తిరిగాయి.

ముసలాయన సుబ్బయ్య అనీ, అంటే ఎవరో—వెంకటేశం పోల్చుకొన్నాడు. ఆయన తనను గుర్తుబట్టలేదు అని తెలుసుకొన్నాడు. ఎందుకంటే నువ్వు ఫలానా కదా అని అడగలేదు కాబట్టి.

'అబ్బాయ్ కాఫీ బాగుందంటే బాగుంది!' అన్నాడు ముసలాయన.

వెంకటేశం బిల్లు రాసి ఇచ్చి, ఆయన వెళిపోతాడు కాబోలు అనుకొంటూ వుండగా 'సూడమ్మా మందేవూరు?'

వెంకటేశం చెప్పాడు. బసులు చెప్పాడు. ఊరు పేరు కూడా చెప్పాడు. ఆ వూరు వూరుకాదు. అసలు వూరుకాదు. ఏదో వూరు. అలాగే పేరు. ఏదో పేరు. తన వూరూ పేరూ సుబ్బయ్యకు చెప్పటం ఇష్టంలేక పోయింది. చెప్పలేననుకొన్నాడు.

ఇంకా రష్ పెరగలేదు హోటల్ పూర్తిగా నిండటం లేదు. మీదేవూరు, ఇక్కడికెందుకు వచ్చారు అని వెంకటేశం అడిగితే ముసలాయన గుండె చెరువయింది.

'ఆ డిల్లాదిలెళ్లిపోయిం కాణ్ణుంచి అది మంచం ఎక్కింది. కూళ్లే నీళ్లే! అంతా మనేద న్నారు, ఆళ్లకేళ్లకి మా పిచ్చా! ఏపీ లాబం గనపళ్లే! ఏందిరి దీనేల యిట్టాటి జబ్బొచ్చిందని పెద్దడాట్రుకు జూపిత్తే పెద్దాస్పటల్లో సూపిచ్చాలా ఇది కేంచరు అవటాంటె అబాగే తెమ్మనుకొని ఈడి కేసుకొచ్చా! ఏపీ మెరు గ్గనబట్టంలే! వొచ్చి వోరం అవుద్ది రేపటిలో. ఎన్నాళ్ళుండాలో యేందో తెలియకుండా వచ్చింది. వత్తాను బాబు! వత్తా!'

వార్డు బెడ్డు తెలుసుకొన్నాడు వెంకటేశం. తనెవరో చెప్పకుండా ఆమెను చూచి రావాలని అనిపించింది. సుబ్బయ్య వెళుతుంటే అసహాయంగా చూస్తూ వుండిపోయాడు. సుబ్బయ్య హాస్పటల్ మలుపు తిరిగింతర్వాత దృష్టి మరల్చుకొని తన పనిలోకి వచ్చాడు.

కొడుకు కోసం వెదకుతున్న తండ్రిలాగా, తండ్రికి తన ఉనికి తెలియకుండా వుంటే మంచిదని తప్పించుకొంటున్న కొడుకులాగా, సూర్యుడు ఉదయించాడు. ఎండకాలం ఉదయం స్వచ్ఛమయిన సూర్యకిరణాలు రోడ్డుమీద మెరుస్తున్నాయి. తెల్లవారేముందు వంటికి హాయిగా తగిలిన గాలి, సూర్యోదయంతో పాటు వేడిమిని పొంది సూదులు గుచ్చుకొన్నట్లు తోలుతూ వుంది.

కట్టుగొయ్య దగ్గర కోడెదూడలకు అప్పుడే వామిలోంచి దూసిన రెండు జనపకట్టలు, రెండుపనల ఎండుగడ్డి వడేసి, వాటివీపులు నిమిరి, వెంకటేశం ఇల్లు వదిలి వచ్చేశాడు.

థర్డ్‌ఫారం నాలుగోసారి చదవటం ఇష్టంలేక ఇంటి దగ్గరే ఉన్న ఒక్కగానొక్క కొడుకు వెంకటేశంను ప్రేమ కొద్దీ కసిగా తిట్టింది తల్లి. ప్రేమ అర్థంకాక, కోపమే తెలిసి ధాం ధూం లాడాడు వెంకటేశం. కొడుకు భార్యను తిట్టాడని పొలంనుంచి ఇంటికి రాగానే విన్న తండ్రికి కళ్ళు మండిపోయింది. 'పద్దూలేదు సందెలేదు తిని ఊరంతా బలాదూరు తిరుగుతూ, దున్నపోతల్లే కొవ్వి కొట్టుకొంటున్నాడు గాడిద' అంటూ పలిగెట్టె తీసుకొని గట్టిగా తగలనిచ్చాడు. దెబ్బలు బాగా తగిలాయి. వాతలు తేలాయి. రక్తంకూడా వచ్చింది. దెబ్బలనొప్పి భరించలేకుండా వుంటే సూటి పోటి మాటలు మరో నొప్పి పుట్టించాయి.

'తల్లిం దిట్టినోడికి పుట్టగతులుంటయ్యా?'

'ఇట్టాటోణ్ణి గోసి పోగులెయ్యాల!'

'ఆవిటి గాకుండా దీని అడ్డంగా బరిత్తే యింతే!'

అటువంటి మాటలు వినలేకపోయాడు. పదేళ్లయింది వూరు వదిలిపెట్టి. ఇల్లు వదిలిపెట్టి రావటం అయితే

తేలికగానే అయిపోయింది. కాని తల్లీదండ్రీ, ఇల్లూ వాకిలీ లేనివాడు ఈ లోకంలో బ్రతకటం ఎంత కష్టమో తెలిసి రావటం మొదలయ్యేసరికి ప్రాణం పోతున్న పని అయింది. మళ్లీ యింటికి పోవటం ఇష్టంలేదు. ఎవరూ గుర్తించని దూరపు వూరు వెళ్లిపోవాలనుకొన్నాడు. ఎక్కడికిపోయినా ఎవరో ఒకరు నువ్వు ఫలానా కదా అంటే ఆ వూరు వదిలిపెట్టి మరో వూరు పోతూ, చివరకు ఇక్కడ స్థిరపడిపోయాడు. తన ఉనికి దాచుకోవటం నేర్చుకొన్నాడు.

మొదట్లో అడుక్కుతిన్నాడు. ఎవరో ఏమో పెడితే తిన్నాడు. తిడితే పడ్డాడు. 'ఎన్నాళ్లే ఇలాగే ఏదన్నా జేసుకోరాదా?' అనే తిట్టు దీవెన! రైల్వే ప్లాటుఫారం మీదో, ఫెన్సింగ్ ప్రక్కనో, గూడ్స్ షెడ్‌లోనో, లగేజీ మధ్యలోనో ఎక్కడో మునగర దీసుకొని పడుకొనేవాడు ఎవరెవరో తిట్టగా కూలీ మోయటం ప్రారంభించాడు. అందుకు లైసెన్సు కావాలని తెలిసి రైల్వేస్టేషన్ వదిలి బస్సుస్టాండ్ చేరుకొన్నాడు.

బస్సుల్లో లగేజి దించటం పైకి ఎక్కించటం, ఇళ్లల్లోకి మోసుకుపోవటం వంటి పనులు కొంత తిండి పెట్టగలగాయి. ప్రతిరోజూ తప్పనిసరిగా పని దొరుకుతుందనిగానీ, ప్రతిరోజూ తిండి తినగలనని గానీ ఏ మాత్రం నమ్మకం లేక పోవటం వల్ల, ఇంతకంటె మంచి పని ఏదయినా దొరికితే బాగుండునని వెంకటేశం ఆలోచింప సాగాడు.

లైసెన్సు లేకుండా రిక్షా తొక్కటం నేరమని మొదట్లో తెలియదు. ఒకరోజు నారోడు 'బువ్వ తింటానికి' ఇంట్లోకి పోతే, బైట వున్న రిక్షా తొక్కుకొంటూ వెలుపలికిపోయి, మనిషిని ఎక్కించుకొని, తొక్కుకొంటూ పోతూ, ఎదురుగా వచ్చే పూటీగా వున్న లారీకి గుద్దినంత పనిచేసి తను పడి, రిక్షాలో మనిషిని పడేసి, మోకాటి చిప్ప తొలగి రెండేళ్లదాకా రిక్షా జోలికిపోలేదు. ఆపైన లైసెన్సు సంపాదించుకొన్నాడు.

రైల్వే ప్లాటు ఫారం మీద తనకు సామాను మోసే లైసెన్సు లేదు. బక్కపీను పీరాకి లైసెన్సు వుంది. రిక్షా తొక్కలేని నారోడికి లైసెన్సు వుంది. బలంగా వున్న తనకు లైసెన్సు లేదు. లైసెన్సులేని వాళ్లు బ్రతుకుతున్నారు! బలం వున్న వాళ్లు లైసెన్సు లేక బ్రతకటం లేదు. ఏదో వింత లోకం కళ్లముందు తిరిగినట్లయింది!

ఆ రోజుల్లో సుబ్బారావుకు జనతా హోటల్ లేదు. టీ కొట్టు వుంది, పొగాకు కంపెనీ దగ్గర. దానికి సుబ్బారావు క్లీనర్–ఓనర్—సర్వర్. కంపెనీలో గ్రేడింగ్ ఆడవాళ్లు ఆ కొట్టులో టీ నీళ్లు తాగుతారు.

ఒకరోజు మార్కెట్టులో కూలిమోసి చెరువులో ఈతకు వెళ్లే వెంకటేశం సుబ్బారావు కొట్టులో టీ తాగాడు. డబ్బులిద్దామని నిక్కరు జేబు ఎంత వెదికినా చిల్లర దొరకలేదు గాని, బట్ట చిరిగిపడిన రంధ్రం దొరికింది. సుబ్బారావు మండి పడ్డాడు. నెత్తీనోరు కొట్టుకొన్నాడు. నోటికి వచ్చినట్లు తిట్టాడు. ఎంగిలి ప్లేట్లు కడిగించాడు. గ్లాసులు తోమించాడు. పంపులోంచి నీళ్లు తెప్పించాడు. ఏం చెయ్యమంటే అది చేస్తున్న వెంకటేశంకు ఏం కావాలంటే అది యిచ్చాడు. ఆ రోజు నుంచి టీ కొట్టు సుబ్బారావుకు సర్వెంట్ దొరికాడు.

ఆ రోజు నుంచి సుబ్బారావు టీ కొట్టు మూడు కవళ్లారు ప్లేట్లుగా పెరిగింది. సంవత్సరం తిరక్కముందే హాస్పటల్ ముందు హోటల్ అయింది. ఆ హోటల్‌లో తిన్న వాళ్లు ఆ హాస్పటల్‌లో చేరవలసిందే. గిట్టనివాళ్ల మాట లెక్క పెట్టకుండా చిన్నదయినా జనతా హోటల్ శుభ్రంగా వుంటుందనే ఖ్యాతి సంపాదించుకొన్నాడు. ఆ రోజు మొదలు వాళ్ల సంబంధం—స్నేహం పెరిగి పెద్దదయింది సుబ్బారావు పెరుగుతున్న కొద్దీ వెంకటేశం హోదా పెరుగుతూ వుంది. ఇప్పుడు సర్వర్ స్థాయిదాటి, అప్పుడప్పుడు కేషియర్‌గా కూడా వుంటున్నాడు. అతని మాట సర్వర్‌లకు వేదవాక్కు! సుబ్బారావుకు బ్రహ్మవాక్కు!

హాస్పటల్‌లో ఉన్న కేన్సర్ పేషెంట్‌ను చూచి రావాలనిపించింది. బైటికి రావటం ఇష్టం లేదు. పైగా భయంగా వుంది. ఆమెను చూడాలని ఆరాటం! తొందర! వెళ్లటానికి భయం! ఏమయితే అదే అవుతుందని బైలుదేరాడు.

ఓ. పి. నిండా జనం. గదుల్లో వరండాల్లో బెంచీలమీద, నేలమీద రోగులు! సైకిల్స్‌మీదా, రిక్షాలమీదా, కార్లమీదా టాక్సీలమీదా వస్తున్నారు రోగులు! తెల్లవారేసరికి పట్టణంలో పుట్టిన జబ్బులు ఉదయమే ప్రత్యక్షమయ్యే తావు ఓ. పి. ఎందరో మనుష్యులు! ఎంతో బాధ! పసిపాపల దగ్గర్నుంచి పండు ముదుసలివాళ్లదాకా అందరికీ జబ్బులు! బాధలు! ప్రతి రూం ముందు జనం. క్యూలో జనం! క్యూలో రోగం! ముందుకు కదులుతూ వుంది. మూలుగులు! అరుపులు! ఏడ్పులు! నడిచే రోగం! నడవలేని రోగం! స్ట్రెచర్‌మీద పోతున్న రోగి, నడిచి బాధపడుతున్న రోగి. వరండాలో మూలగా, రోగంలేని కాలేజి విద్యార్థి—బెంచ్‌మీద యువతి. కళ్లలో వెలుతురు! క్షయరోగి దగ్గి ఉమ్మివేసిన కళ్లెలోపడి లేవకుండా వున్న ఈగలు!

వార్డులో మెట్లు ఎక్కుతూ పైకి చూశాడు! మెట్లు దిగుతున్న వ్యక్తివైపు చూచి క్షణంసేపు ఆగిపోయాడు. వెంటనే

వెనుదిరిగాడు. వణుకు! చెమట! పరుగెత్తినట్లు హోటల్ వైపు నడిచాడు!

అంతకు మునుపు హాస్పటల్‌కు బైలుదేరిన వెంకటేశం కాదీ తిరిగివస్తున్న వ్యక్తి. మనిషి బాగా కుంగిపోయాడు. మునుపున్నంత ఎత్తూ లావూ లేడేమో ననిపించింది. దిగాలుగా వెనుదిరిగి చూసుకొంటూ, ఆమెను చూడలేక పోయినందుకు బాధపడుతూ స్మశానంలో సర్వం కోల్పోయి వస్తున్నవాడి విధంగా కనిపించాడు.

హోటల్‌కు వచ్చేసరికి గందరగోళంగా వుంది. అదిచూచి వాకిట్లో ఆగిపోయాడు. వణుకు! విపరీతంగా వణుకు! చెమట! భయంకరంగా చెమట! సాంబారులో కాళ్ల జెర్రి పడిందని, ఇంత అశ్రద్ధ అయితే ఎట్లా అని ఎవరో ఎగురుతున్నాడు. విషయం విన్నతరువాత వెంకటేశం నెమ్మది చెందాడు. ఆ మనిషిని పిలిచి, వెలుపలికి తీసుకువచ్చి, సాగనంపి, తిరిగి వస్తూ:—హోటల్‌ముందు కిళ్లీకొట్టు దగ్గర ఎవరో చెక్కెర కేళీ కొని, తిని, తొక్క పడేసి పోతే, — చూడకుండా కాలువేసి జారిపడి, నడుం నొప్పి పుట్టి, నెమ్మదిగా లేచి లోపలికి వచ్చాడు.

ఎందుకో తెలియదు. ఎక్కడో తెలియదు. భయం పుడుతూ వుంది. దిగులు కలుగుతూ వుంది. ఉదయం నుంచీ, ఎప్పుడూ రాని, ఎన్నడూ లేని విచిత్రానుభూతి! భయం తెరలవెనుక చీకటి మైదానంలో ఆకస్మాత్తుగా మంటలు లేచి, చప్పున ఆరి పోతున్నాయి. గాలి తోలనట్లు, ఊపిరి ఆడనట్లు, ముక్కు బిగిసిపోయినట్లు, ప్రాణం పోతున్నట్లు ఏదో చెప్పరాని భయం.

కోటి కాఫీ తాగి వస్తూ 'బాగుందావా?' అంటే 'ఊ?' అని 'వూఁ' అన్నాడు వెంకటేశం. ఈ కోటి ఒకరోజు హోటల్‌కు వచ్చి, కాఫీ ఆర్డర్ చేశాడు కోటికాళ్లు బురదతో మురికిగా వున్నాయి. కాళ్లు ముడిచి కుర్చీమీద కూర్చున్నాడు కుర్చీమీద కాళ్లు తీయమంటే, తీయనటంతో మాటా మాటా పెరిగాయి మాటకుమాట తెగులు నోటికి పాచి తెగులు అన్నట్టు బాహాటు చేతలయ్యాయి. దెబ్బలాట అయింది. ముష్టా ముష్టి కాలాకాలి, జుట్టాజుట్టీ, కొట్టుకొంటున్నారు. తన్నుకొంటున్నారు. వంచుకొంటున్నారు. అంతా గోల గోలయింది.

అంతా సర్దుబాటు అయింది. కాని సుబ్బారావు కోపం చల్లారలేదు. తగువులాట జరిగితే హోటల్‌కు ఏం గౌరవ ముంటుంది? అందువల్ల కోటిని పనిలోనుంచి తీసివేస్తానని పట్టుబట్టాడు. వెంకటేశం వద్దంటే మన్నించాడు. రెండో రోజు నుంచి ఏ హోటల్‌కైనా పొమ్మని కోటికి సుబ్బారావు చెప్పాడు. ఆ మధ్య హోటల్‌కురాని కోటి ఆ రోజు వచ్చి కాఫీ తాగి పోతున్నాడు. కాలం చాలా జబ్బులు నయంచేసే మందు! ఆ రోజునుంచి పనివాళ్లకు వెంకటేశం అంటే గురి! ఏం కావాలన్నా అడిగేవాళ్లు! కష్టాలు చెప్పుకొనేవాళ్లు! సహాయం పొందేవాళ్లు! సలహా వినేవాళ్లు!

తను వచ్చేసరికి తన టేబుళ్లు చూస్తున్న కోటి, పోయి టిఫిన్ తిని రమ్మన్నాడు. వెంకటేశం కాఫీమాత్రమే తాగి 'నాకేం బాగాలేదు' అన్నాడు.

కిటికీదగ్గర కూర్చున్న ముసలాయన ఎవరో అప్పుడే మూడోసారి సాంబారు వేయించుకొన్నాడు. ఇడ్లీలు అలాగే వుంచి సాంబారు పూర్తిచేస్తున్నాడు అంత పెద్దవాణ్ణి ఏమనటం బాగుంటుంది?

ఉదయమే లేచి, చద్దన్నం తిని, పనీపాటా చూసుకొనే జాతికి కాఫీ తాగే అలవాటు ఆంగ్లేయులమూలంగా వచ్చిందేమో కాని, సాంబారు ఇడ్లీ సంగతి—అనుమాన రాహిత్యం—మాత్రం మద్రాసునుంచే దిగుమతి అయింది. నాగరికత జాతి జీవితంలో కదలిక తెచ్చింది. ఉన్నచోట ఉంచలేదు. అది పురోగమనమో కాదో ఆలోచించే అవకాశమే లేదు ఈ మహాప్రవాహంలో పడి కొట్టుకుపోయే జాతి ఎప్పుడు ఒడ్డెక్కి తిరిగి గతాగతాలు పరికిస్తుందో!

ఎవరో వచ్చారు కాఫీ చెప్పారు. ఇచ్చాడు. ఇడ్లీ వడా సాంబారు చెప్పారు తెచ్చాడు. 'మినపట్టు—మూడు పార్శిల్' —కట్టించారు. అల్లం ముక్కలు లేవని గోల! అల్లం పచ్చడి కావాలని కేక! కాఫీ చల్లగా వుందని—రిపోర్టు! ఈగలతో చచ్చే చావు అయింది—విరాము!

'కాఫీ స్పెషల్—కాఫీ అర్జంట్—కాఫీ స్ట్రాంగ్. కాఫీ షుగర్ వద్దు—రేప్ వెంగాయి—ఏందీ తలాతోకా లేని బిల్లు!—ఒక కాఫీ!—కొంచెం సాంబారు — ఏం వుంది — ఇడ్లీ వడా మినపట్ పెసరట్—మినపట్ ఉల్లిపాయ ముక్కలు బాగా — కాఫీ స్ట్రాంగ్— చూచి నడువు! నీ ముఖం లాగా వుంది కాఫీ—నన్నేం చేయమంటావు — రేయి పైపడుద్ది అటు ఇటు—ఛా లే!— కాఫీ స్పెషల్— బిల్లెంత?—కాఫీ పార్శిల్— ఏం గురూ ననబ్బోదు?— కళ్లుంటే—నీళ్లు పొయ్యి— చచ్చే సావు—ఎప్పుడొస్తా—ఇడ్లీ వడా సాంబారు రెండు ప్లేట్లు.'

హోటల్ ధ్వనులు—రణగొణ ధ్వని!

వాష్ బేసిన్‌లో చేయి కడుక్కొని పంపు ఆపకుండా పోయి కూర్చున్న యువకుడి వైపు అసహనంగా చూశాడు వెంకటేశం. అతడు పోయి పంపు ఆపి రావటం చూచి కోటి

నొచ్చుకొన్నాడు. 'రేడింటో నీళ్ళయితే ఇట్టా బారబోసుకొంటాడా?' అనుకొన్నాడు.

కిచిన్ లోంచి కాఫీ ఫ్లేవర్, సాంబారు వాసన. నూనె కంపు, చెమట వాసన, సెంటు, సాంబ్రాణి వాసన. తలనూనె గంధం. స్పెషల్ రూంలోంచి వచ్చే మార్కోపోలో పొగ అగరుబత్తి వెలిగించిన సువాసన—

ఏదయినా ఏ సిగరెట్టు అయినా తనకోసం కొట్టు కొంటాడు. కాని, నలుగురుకోసం సరకుడు తగరేసుకొనే ఆరోగ్యం ఉన్న మార్కోపోలో! హోటల్లో నాసిరకం సిగరెట్లు! బీడీలు కంపు! చుట్టలు! ఎంతో వాసన! అంతా కలిసి హోటల్ వాసన!

హాస్పటల్ టవర్క్లాక్ పదకొండు గంటలు పలికింది. వచ్చేపోయేజనం రద్దీ తగ్గింది. ఎడతెరపి చిక్కింది. కిటికీలోంచి వచ్చే ఎండ పొడవు తగ్గింది. కిచిన్లోనుంచి 'సుయ్ సుయ్లు' ఆగిపోయాయి. తిరునాల జరిగిన మర్నాడు ఉదయం దేవాలయప్రాంగణంలాగా వుంది హోటల్.

కిటికీలలోంచి పడుతున్న ఎండపొడలు, క్రింద నీటి మరకలు, కాఫీ తొణుకుల గుర్తులు, దుమ్ము, చేతిలోంచి జారిపడిన ఇడ్లీముక్కలు, టేబిల్కొనలో మిగిలివున్న పచ్చడి గుర్తులు, కుర్చీమీద పడిన నీటిబొట్టు, నల్లటి మచ్చల గోడలు, రకరకాల బొమ్మలు! కాలెండర్లు, దేవుడిపటం మేకుమీద పూలదండలు, పటంమీద అగరుబత్తుల కొనలు, క్రింద నుసి, వాష్ బేసిన్లో మరకలు — హోటల్ వింతగా వుంది.

ఇద్దరు యువకులు వచ్చారు. పేంట్లూ షర్ట్లూ వంటికి బిగిసిపోయివున్నాయి! తలలు రెండూ క్రూకట్స్! చూడముచ్చటగా వున్నారు. హాస్పటల్ ఔట్గేట్ చూస్తూ కూర్చున్నారు. కాఫీ కావాలంటే తెచ్చియిచ్చాడు వెంకటేశం. సిగరెట్లు ముట్టించుకొన్నారు.

'గురూ!' పలకరించాడు ఎర్రటి లావుపాటి యువకుడు.

'ఏం గురూ!' బదులు పలికాడు సన్నటి నల్లటివంకీల జుత్తు యువకుడు.

ఇద్దరూ పరస్పరం గురుశిష్యులు!

'ఏం గురూ రాలేదు?'

'చూద్దాం చూద్దాం రాకపోద్దా?'

'చాకులాంటి పిల్ల గురూ అది. దాన్నడక జూస్తుంటే తిక్క రేగుద్దంటే నమ్మ!'

సిగరెట్లు రెండు కాలి మసిఅయిపోయాయి.

స్పెషల్రూంలో మార్కోపోలో యువకుడు 'బోయ్!' అంటే వెంకటేశం వెళ్ళాడు. ముక్కు ఎగరేస్తూ నొసలు చిట్లించి, మార్కోపోలో పెదవికొసలో వుంచి తల అడ్డంగా వంకించి 'బిల్! బిల్!!' అన్నాడు. ఇస్తే తీసుకొని, నడుం బిర్రుగా వొంకరగాపెట్టి, రష్యన్ ఆర్మీ సైనికుడు మార్చింగ్లో చేయి తిప్పుకొంటూ పోయినట్లు వూపుతూ వెళ్ళి, అటూ ఇటూ చూచి, బిల్లు టేబిల్మీద పెట్టి, సిగరెట్టు నోట్లోంచి తీయకుండా పర్సులోంచి నోట్ తీసి ఇచ్చి, చిల్లర తీసుకోకుండా పిలిచినా వినకుండా, తల వూపుతూ, నడుం బిర్రుగా, చేయి సైనికుడిలా, సిగరెట్ తీయకుండా, అర్జెంట్ పనిమీద తాపీగా ఎటు వెళ్ళాలో తెలియకుండా హాస్పిటల్లోకి వెళ్ళాడు.

క్రూకట్ యువకులు మూడోసారి సిగరెట్లు ముట్టించారు. వెంకటేశం ప్రక్కటేబిల్ దగ్గర కుర్చీలో కూర్చొని, టేబిల్ తంతూ వాళ్ళవైపు అర్థం లేకుండా ఏదో లోకంలో, ఆలోచనలో కూరుకు పోయి చూస్తున్నాడు. ఎందుకు కూర్చున్నారు అన్నట్లుగా చూస్తున్నా డనుకొని, 'రెండు కాఫీ' అని క్రూకట్స్ రెండోసారి కాఫీ ఆర్డరుచేస్తే మొదటిసారి వినక, రెండోసారి విని, నిజంగానా అన్నట్లుగా చూచి, లోపలికి పోయి, కాఫీ తెచ్చి యిచ్చాడు, వెంకటేశం.

కాఫీ చూశారు. తీసుకో లేదు. బిల్లుకూడా పుచ్చుకోలేదు. గబగబా పైకిలేచారు ఆదరాబాదరా నాయుడు కాసేపు బిల్లు చెల్లించారు. పరుగెత్తినట్లు రోడ్డుమీదికి నడిచారు అప్పుడు వాళ్ళముందు యువతి వుంది! మనిషి ఎర్రని! జడ పొడుగు! నయస్సులో వుంది. తొంకరి మెరుపు చక్కని నవ్వుతుంది. గడియారంలో లోలకం గుర్తుకు రావచ్చు! ఆమె వెళుతూవుంది. వెనుక క్రూకట్—యువకులు!

యువకుల వైపు చూస్తూ వెంకటేశం గుమ్మాదాపు దగ్గరగా వున్నాడు 'వెంకటేశం వెంకటేశం' బయంగా పలకరించాడు సుబ్బారావు. 'ఏమయింది?'—'పాపం!'; 'ఏమి?'—జగ్గు వస్తున్నాడు!'; 'కాఫీ!'—'ఎవరికి'! 'ఏం పలకావేదు'. జగ్గు లోపలికి వచ్చి కూర్చున్నాడు. వెంకటేశం టేబిల్ దగ్గరకు పోయి ఏం కావాలి అన్నట్లుగా దీనంగా చూశాడు జగ్గు 'కాఫీ' అన్నాడు. వెంకటేశం తెచ్చియిచ్చాడు. జగ్గు సుబ్బారావువైపు దీనంగా కోపంగా; జాలిగా భయంకరంగా; ప్రేమగా క్రూరంగా; తొందరగా దిగులుగా వచ్చిన చూచి నవ్వాడు. గబగబా నవ్వాడు! త్వరత్వరగా నవ్వాడు నవ్వుతూ వున్నాడు టక్కున మానేశాడు చకచకా కాఫీ ముగించాడు తొందర తొందరగా బిల్లు తీసుకొన్నాడు. చెల్లించాడు. వెళ్ళిపోయాడు! సుబ్బారావు

వళ్ళంతా చెమట! నుదుట నీళ్ళు! గుండెవేగం! కళ్ళుమంట! నోటివెంట మాట లేదు.

జగ్గు వెళ్ళిపోయి అయిదు నిమిషాలయినా సుబ్బారావు కోలుకోలేదు. జగ్గు హాస్పిటల్‌లోకి పోవటం చూసి వెంకటేశం కంగారు పడసాగాడు. నిలబడలేక పోయాడు. లోపలికిపోయి ముఖంమీద నీళ్ళు జల్లుకొని ఆయాసంగా వచ్చాడు.

మూడేళ్ళ క్రితం జగ్గు హోటల్‌కు వచ్చి టిఫిన్ కాఫీ తీసుకొని, బిల్లు తీసుకోకుండా అనవాయితీ ప్రకారం వెళ్ళిపోతుంటే చొక్కా కాలర్ పట్టుకొని నిలబెట్టాడు వెంకటేశం!

జగ్గు ఏ హోటల్‌లోనూ కాఫీ అయినా భోజనం అయినా బిల్లు తీసుకోడు. రైల్లో బస్సు టిక్కెట్టుకొని ఎక్కటం ప్రయాణం చేయటం తెలియదు. లా అండ్ ఆర్డర్ అతనికి తెలియవు. నాగరకత జీవితంలోని చాలా నియమాలు అతనికి వర్తించవు.

ఆటో మొబైల్ ఇంజనీర్స్ వర్క్‌షాపులో మెకానిక్కు! ఎక్కువ మాట్లాడడు! సాధారణంగా అతనికి డబ్బు అవసరం ఉండదు! అడిగితే షాపులో ఎవరయినా ఇస్తారు. ఇవ్వకపోతే తీసుకొంటాడు. అవసరంకంటే మించిన డబ్బు తీసుకోవటం ఉంచుకోవటం అతనికి అలవాటు లేదు. భార్యలేదు. పిల్లలు లేరు. బాదరబందీ లేదు. ఏకాకి!

ఆ రోజు బిల్లు చెల్లించవలసి రావటం జగ్గు జీవిత గమనంలో ఎదురుదెబ్బ! 'పోరా పో' అని టలాయించి పోబోయాడు. వెంకటేశం పోనీలేదు. 'ఫోం చేస్తావేందిరా సన్నాసి నాయాల!' అంటే బిల్లు చెల్లించమన్నాడు వెంకటేశం. 'తిను! తినరా నా కొడక!' అంటూ వెంకటేశంను వంచి వీపు మీద గుద్ది 'సాలా? ఇంకా గావాల్నా వొడ్డన?' వెంకటేశం తిరగబడ్డాడు—జగ్గు చివరకు బిల్లు చెల్లించి పోయాడు.

అంతే! అది మొదలు ఈ మూడేళ్ళలో జగ్గు ఆ వైపు రాలేదు. ఇంతకాలం తర్వాత రావటం వింత! ఆశ్చర్యకరమయిన సంగతి. బిల్లు చెల్లించకుండా పోలేదు. చెల్లించాడు. కోపంగా చూళ్ళేదు. నవ్వాడు. సుబ్బారావు గుండెలు చెమటతో తడిసి, నాని ముద్దయి జావగారిపోతున్నాయి.

సూరి ఊళ్ళోకి వస్తూనే హోటల్‌కు వచ్చి వెంకటేశంను పలకరించాడు. రెండేళ్ళనుంచి సెలవులో వున్నాడు. సూరి హాస్పిటల్‌లో గుమాస్తా! చివరికి 'పరీక్షలు ఎలా వ్రాశావ్?' అని అడిగాడు. 'బాగనే' వెంకటేశం సమాధానం.

ఖర్చ్‌సారం ఆనర్స్ చదవటంతో పునాది బాగా గట్టిపడిందని పాతకాలపు జోక్ విసరటం సుబ్బారావుకు అలవాటు. ఆత్మీయంగా మాట్లాడేటప్పుడు 'నీ జాతకం గొప్పది. నీ మూలంగానే గందా నాకీ దసె!' అని కూడా అంటాడు. హోటల్‌లో పనిచేసుకొంటూ మెట్రిక్ పాసయి, నైట్ కాలేజీలో పి. యు. సి. చదివి పైకి వస్తున్నాడు తన సర్వర్ అని సుబ్బారావుకొక గర్వం. ఆనందం. గొప్ప!

'చూడరా' సూరి ప్రారంభించాడు. 'నీకేం దిగుల్లేదు—ఎందుకంటావా? నిన్ను అడిగేవాళ్ళు లేరు అనేవాళ్ళు లేరు. నీ యిష్టం నీది. మరి నా సంగతో? అంతా పేచి! మడత పేచీ! అన్నీ ఆ ముసలాడితో చెప్పాలి—దేని కవునంటాడో, దేనిక్కాదంటాడో, నాగ్గానీ, ఆయనగ్గాని మమ్మల్ని పుట్టించిన ఆ దేవుడిగ్గానీ తెలియదు. నైట్ కాలేజీలో చేరుతానంటే ఊః! ఊః! చేరుచేరు అన్నాడు. తీరా చేరింతర్వాత ఎందుకు చేరావు మానేయ్ అని గొడవ. ఎట్టా చచ్చేటట్టు ఆయన్తో! అదంటే అట్టుంచు! కంతేరమ్మాయి న్యూసాప్పి బాగుందంటే బాగుందనుకొని వాళ్ళకా సంగతి అంతాజేసి రాసి, నిన్న ఆ సంబంధం వద్దంటేవదు మానేద్దామంటాడు. అంతా ఆయనిష్టమే! నేనొకణ్ణున్నాననిగానీ, నాక్కూడా ఇష్టం గిష్టం ఉండొచ్చుననిగానీ అనిపించ దా మనిషికి? ఏం చెప్పేటట్టు? అసల్నేనంటే లెక్కాపత్రం లేదామనిషికి? ఏడకన్నా పారిపోదామనిపిస్తుంటుం దప్పుడప్పుడూ!' సూరి చెప్పటం ఆపి కళ్ళు అద్దుకొన్నాడు. సూరి మునుపెప్పుడూ తన గోడు చెప్పుకోలేదు.

తను ఇల్లు విడిచి పారిపోయి వచ్చిన పరిస్థితులు గుర్తుకు తెచ్చుకొన్నాడు వెంకటేశం!

పొన్నుగర్ర ధోవతి, లాల్చీ కళ్ళజోడు లేకపోతే ఆ ముసలాయనకు అస్తిత్వంలేదు. నల్లకోటుప్లీడరు ప్రక్కనుండకపోతే, అతనెవరి దృష్టినీ ఆకర్షించడు. కాఫీ చెబితే నాగలింగం తెచ్చియిచ్చాడు. ఉన్నట్టుండి 'వాడికి నేనేం తక్కువ జేశాన్రా చెప్పు! చెప్పరా! నువ్ జెప్పు!' ప్లీడరు మాట్లాడలేదు. 'నువ్ వాడికి ప్లీడరువికదా! చెప్పు నా ముఖం చూచి చెప్పరా కిట్టూ! నేనేం అన్యాయం జేశాన్రా వాడికి. చదువు చెప్పించలేదా? ఉద్యోగం ఇప్పించలేదా? కోరుకొన్నదాన్ని కట్టుకోనివ్వలేదా? నేనేం జేశానిరా వాడికి కష్టం! పోతూపోతూ కట్టుకుపోతానా? నాతో కాల్చుకొంటానా? ఏం జేసుకొంటాన్రా యీ ఆస్తి! ఎంత లేదన్నా ఆస్తంతా వాడిదే గందా! ఎందుకురా యీ ఆరాటం వాడికి? నేను హరీ అన్నదాకా ఆగలేకపోతే మానె! అవసరం అయితే నా కింతకావాలి తే అని తీసుకుపోవచ్చుగా అది లేదా? లేకపోగా కోర్టుకెక్కిస్తాడ్రా వీడు నన్ను? గుడ్డొచ్చి పిల్లనెక్కిరించదని వీడునా అంతు చూస్తా

వంటాడా? ఇల్లు నా కష్టార్జితం! ఆస్తి యావత్తూ నా సంపాదన! వాళ్ల తాతముత్తాతల ఆస్తి దమ్మిడీ—దమ్మిడీ లేదు దద్దమ్మని చచ్చుదద్దమ్మ అది వీడి చెవులకు తాటాకులు గట్టి ఆడిస్తుంది పిచ్చిసన్నాసి బొత్తిగా తెలివిలేదు వాడికి. వాడికి నవ్ తోడు. కిట్టూ వేన్నెప్పున్నాన్జుడు వాడి కేమాత్రం వయినా తల్లీదండ్రీ గురువూ దైవం అనుంటే అయిందేదో అయిపోయింది పొరపాటే చేశాను క్షమించమని ఏడవ్వను లేదో వాడిష్టం తర్వాత్తర్వాత నన్ని లాభంలేదు. చెప్పు వాడి కిదంతా—అం' అని గటగటా కాఫీతాగి, కోపంగాలేచి, పొన్నుగర్ర తాటించుకొంటూ బిల్లు దురుసుగా లాక్కొని చెల్లించి, వెను దిరిగి చూడకుండా మెట్లుదిగి వెళిపోయాడు.

ప్లీడరు కృష్ణమూర్తి కూర్చున్న చోటునుంచి కదల్లేదు. కోటు జేబులోంచి పొగాకుచుట్ట తీసి తుది మొదళ్లు వలిపి, నోట్లో పెట్టుకొని, వెలిగించుకొని, తన్మయత్వంతో పీల్చి, కుర్చీవెనక్కు చేరబడి, భువనమోహిని పంచిన అమృతం ఆరగించే మహేంద్రుడులా, ఆదమరచిపోతున్నాడు.

పొన్నుగర్ర పెద్దమనిషి వెళుతుంటే వెంకటేశం దృష్టిలో నూరి మెదిలాడు. ఆర్యనాగార్జునుడి మాధ్యమిక కారికలలో తండ్రులు—కొడుకులు ఉదాహరణలు మాదిరిగా — ఒక దృష్టితో—లేరు. ఏదో లోపం వుంది. తండ్రీకొడుకుల కలనేతలో ఎక్కడో పోగులు తప్పిపోయాయి. గతంలోని ప్రాచీనతా వాసన, అధికారం వదులుకోలేని తండ్రులు భవిష్యత్తులోకి గమించే ఆధునికాకాంక్షులు చైతన్యులు అయిన కొడుకులుమధ్య వర్తమానం చిత్రవధకు గురిఅవుతూవుంది.

తన విషయమే గుర్తుకు వచ్చింది. అప్పటిలో తండ్రి ఛాందసుడూ కాడు. తను సాహసుడూ కాడు. అయినా విడిపోవడం సంభవించిం దెందుకో తెలియదు.

అస్తమిస్తున్న సూర్యుణ్ణి చూచి చంద్రుడో, చంద్రుణ్ణి చూచి సూర్యుడో, ఆరిపోయే దీపాన్ని చూచి ప్రమిదో, ప్రమిదను చూచి దీపమో, ఎగతాళిగా అనహనంగా నవ్వుతున్న పోలికే యిది. గతం అనుభవం నీడలో వర్తిల్లబోయే ఆగతం, వర్తమానంలో కొట్టుమిట్టాడటమే తండ్రి కొడుకుల సంఘర్షణ!

ఈ సంఘర్షణ ఒక్కనాటిది కాదు. సృష్టి ఆరంభం నుంచీ ఉండవచ్చు. యయాతి కొడుకు యౌవనం కోరటం అటువంటిదే కావచ్చు! ఏమయినా పూర్వం లేని విశృంఖలత నాగరికత తెరమాటునుంచి రంగస్థలప్రవేశం చేయటానికి అనుక్షణం యత్నిస్తూవుంది. పూర్తిగా అవకాశం వస్తే అంతా అడ్డమాకలు లేని విశృంఖలత అయిపోతుంది.

'కృష్ణా! కృష్ణపరమాత్మవై పోయావు మహానుభావా! ఎంతెందు వెదకిచూచిన అందందే!' — 'ఆపవయ్యా స్వామి. వింటే పంచరత్నాలు పఠించేలాగున్నావ్. ఏమిటి కథ' కృష్ణ సమాధానంగా పలికాడు.

'అలనాడు విజయుడికి సారథివై చేసిన గీతోపదేశం ఈనాడు తండ్రీ కొడుకులమధ్య తగాదాలు—' —'ఆపవయ్యా పంతులూ ఆపు! ఏం గావాలి చెప్పు! స్వీట్ హాట్ కాఫీ.'

'ఏమీ వద్దు—ఒక్కమాట' ఇద్దరూ వెలుపలికి వెళ్లారు.

'అడకత్తెరలో ప్రజాస్వామ్యం. హక్కులు గుర్తించి బాధ్యతలు నెరవేర్చే సామూహిక శక్తి సంకల్పం అవరోధాలతో గమిస్తూవుంది. బాధ్యతలు గమనించని హక్కులు బలాత్కారం చేసే దుష్టశక్తుల తీవ్రత పెచ్చుమీరుతూ వుంది. విభిన్న శక్తుల పోరాటంలో ప్రజాస్వామ్యం—చావుబ్రతుకుల్లో వుంది.'

గోపాలం సంపాదకీయం చదువుతున్నాడు. సన్నగా, పొడుగా వుంటాడు. పైజామా లాల్చీ అతనికి ఎప్పుడూ వుండే బట్టలు! హాస్పటల్‌లో పనిచేస్తుం దాతని భార్య! ఆమె నర్సు! గోపాలంను నర్సుభర్త అనటంకూడా కద్దు! ఉద్యోగం లేదు. కాలం గడపటమే అతనికి కష్టం! ఉదయం ఆలస్యంగా నిద్ర లేచి, పదకొండు పన్నెండు గంటలకు జనతకొచ్చి కాఫీ తాగి మూడు నాలుగు పేపర్లు చదివి, ఒంటిగంటకో రెండింటికో ఇంటికి పోతాడు. వెంకటేశం మిత్రుడే! అప్పుడు కాఫీతాగుతూ పేపరులో సంపాదకీయం చదువుతున్నాడు.

'తరతరాలనుంచి కుంచించుకొని, బిగిసి రాటుదేలిన ఈ జాతి గుండెల్లోంచి నిజమైన అభివృద్ధి పుట్టదు. వికాసం జన్మింపదు. పెరుగదు. ఏ రంగంలోనయినా నూతన్న పరిణామం ఆవిష్కరించే ప్రయత్నం జరుగుతుంటే అదే సమయంలో దానిని అణచిపెట్టే ప్రయత్నాలు బలవత్తరంగా విజృంభిస్తాయి. ఈ దేశం ముందుకు పోదు. ఈ జాతికి మనుగడ లేదు.'

'అంతనిరాశ పనికిరాదు!' వెంకటేశం ఎదురుగా నిలబడి బాధగా నవ్వుతూ నిరాశగాచూస్తూ చెప్పాడు. గోపాలం అర్థం కాక అయోమయంగా చూశాడు. 'ఈ దేశం అభివృద్ధి సాధిస్తుంది. ఈ జాతి జీవిస్తుంది—ఏమీ అనుమానంలేదు. పీడితులు మేల్కొంటున్నారు.'

గోపాలం అనుకొన్నాడు, ఈ ధోరణి సహజంగాలేదుఅని, ఏదో వెలితి కృతకత్వం ఉన్నాయని.

ఎవరో కాఫీ అడిగితే ఇచ్చివచ్చాడు వెంకటేశం. వీధిలో ఎవరో యువతితో వెళుతున్న రంగడు కనపించాడు. 'రంగడు పెద్దవాడయ్యాడు' అనుకొన్నాడు.

నాలుగునెలల్రకితం ప్రొప్రయిటర్ తనని తిట్టి, కొట్టి, గెంటికినెట్టి, ఉద్యోగంలోంచి తొలగించాడని రంగడు ఏడుస్తూ చెబుతుంటే వెంకటేశం వినలేకపోయాడు.

చెంపలువాచి, కళ్ళువుబ్బి, జుత్తురేగి, చొక్కా చిరిగి, వికారంగా, దయనీయంగా కనిపించాడు రంగడు. మనిషిని చూచి, జరిగిన క్రూరత్వం ఊహించుకోగలిగాడు.

ఉద్యోగంలోంచి తొలగించిందెందుకో కనుక్కొంటే కారణం సమంజసంగా కనిపించలేదు. రంగణ్ని హాస్పటల్లో చేర్చి, ప్రొప్రయిటర్ని కలుసుకొని సంజాయిషీ అడిగేతీరులో మాట్లాడాడు. ఇష్టంవచ్చినట్లు తిడుతూ వెంకటేశంను వెళ్ల గొట్టాడు ప్రొప్రయిటర్.

నాలుగు పెద్దహోటళ్ల ప్రొప్రయిటర్లను కలుసుకొని 'ఈ అన్యాయం వినండి, న్యాయం చేయండి'అని కోరాడు. 'మాకేం పట్టింది. మాకెందుకు కా రొచ్చు' పొమ్మన్నారు. ఈ అన్యాయం సహించవలసిందేనా? అందరూ పట్టుబట్టారు.

'రంగణ్ని పనిలోకి రానీకపోతే మేమూ రాం' అని వాకిట్లో హోటల్ముందు కూర్చున్నారు. ప్రొప్రయిటర్ తిట్టి కొట్టి తరిమివేయాలని చూచాడు. వీలు కాలేదు.

తెల్లవారి ఎనిమిది అయ్యేసరికి ఆకలితో అలమటించి పోయేవాళ్లు వచ్చినవాళ్లు వచ్చినట్లే మరో హోటల్కు అయినా వెళుతున్నారు. లేదంటే ఏమయిందంటే ఏమయిందని అడుగుతున్నారు.

పదినిమిషాల్లో కుక్లు, సర్వర్లు తీసుకురాబడ్డారు. వెలుపలివాళ్లు లోనికి పోబోతే, మెట్లమీదవాళ్లు అటకాయించారు. కొట్లాట లేదుగాని నెట్లాట జరిగింది.

రెండోరోజు హోటల్ మూసివేస్తానని ప్రొప్రయిటర్ శేఖర్ బెదిరించాడు బెదిరింపే అనుకొన్నారు గానీ, నిజంగా తాళాలువేసి వెళ్లాడు. మూడోరోజు పట్టణంలో ఉన్న హోటళ్లలో చాలామంది పని మానివేసారు. ఆ సాయంకాలం హోటల్ యజమానులందరూ కూడబలుక్కున్నారు. ఆ రాత్రి సుబ్బారావు వెంకటేశంను పిలిచి 'నీ కెందుకు జెప్పిందులో జోక్యం—మ వ్వారుకో నీకేం దెబ్బ' అని చెప్పిచూశాడు. వెంకటేశం కోపంగా సమాధానం చెప్పాడు. ఏమయిందో తెలియదు గానీ రాత్రికి రాత్రి రంగణ్ని పనిలో చేర్చుకొన్నాడు ప్రొప్రయిటర్ శేఖర్.

ఆ మర్నాడు రంగణ్ణి పలకరించి, మెట్లు దిగి, రోడ్డు ప్రక్కనా సిగరెట్టుషాపు నటరాజన్తో మాట్లాడుతూవున్నప్పుడు చాలా స్పీడ్తో మీదపడుతుందేమోనన్నంత భయం కలిగించిన కారు, తప్పుకొన్నా ఎడంచేతికి బలంగా తగిలి పోయింది. శేఖర్ కారులో వున్నాడు. అప్పణ్నుంచి ఆ కారు కనిపిస్తే దూరంగా పోతున్నాడు వెంకటేశం.

హాస్పటల్నుంచివచ్చిన డాక్టర్లు నలుగురూ వెంకటేశం టేబిల్ ఆక్రమించి కాఫీ ఆర్డరుచేయటంతో ఆలోచనలలోనుంచి వెలుపలికి వచ్చాడు. 'వెంకటేశం పలుకువున్నమనిషి' అంటాడు డాక్టరు రవీంద్ర. అతనే జబ్బునుగూర్చి ప్రారంభించాడు. 'నాకీ జబ్బు అర్థంకాలేదు' ట్రీట్మెంట్ ఇంపాజిబుల్!' ఆ జబ్బునుగూర్చి ఆలోచించుకొంటున్నారు.

'ఇవి సృష్టి ప్రారంభంనుంచి ఉన్నజబ్బులే! దారిద్ర్యం జబ్బు! ఆకలి జబ్బు! వర్గం జబ్బు! అంతస్తు జబ్బు! కులం జబ్బు! ఈర్ష్యజబ్బు! కుళ్లు జబ్బు! లోకంనిండా జబ్బులు! విపరీతంగా జబ్బులు! 'ఈ జబ్బులు నయంకావు. వీటికి మందులు లేవు.'

గోపాలం సంపాదకీయం చదువుతున్నాడు. క్రొత్తజబ్బును గూర్చి చర్చిస్తున్న డాక్టర్లలలో ఎవరు కాఫీకి ఆర్డరుచేశారో, ఎవరు తాగుతున్నారో లేదో, ఎవరు బిల్లు తీసుకొన్నారో ఏమీ తెలియదు. బిల్లు టేబిల్మీద ఫేన్గాలికి నృత్యంచేస్తూవుంది.

రోడ్డుప్రక్క పడేసిన హోటల్ ఎంగిలికోసం కుక్కలు ఎగబడుతున్నాయి. హోటల్ అడుక్కొన్న పకోడీముక్క ఆవురావురుమంటూ తింటున్నాడు బిచ్చగాడు. గ్లాసులో కాఫీ సగం మిగిల్చి తాగిపోయాడో విద్యార్థి! హోటల్ప్రక్క ఎంగిలి కోసం అరుచుకొంటున్న కుక్కలమధ్యకు తోలుకొంటూ బలహీనుడు పిట్టమనిషి—పిల్లాడొకడు చొరబడ్డాడు

'కుక్కలు కవర్లాడుతున్నాయి కుక్కలు పోటీపడుతున్నాయి. కుక్కలు కరుచుకొంటున్నాయి కుక్కలు అరుచుకొంటున్నాయి. బలంవున్నకుక్క బ్రతుకుతుంది. బలంలేనికుక్క చస్తుంది బలం బ్రతుకుతుంది. బలహీనత చచ్చిపోతుంది.'

గోపాలం కళ్లు చెమ్మగిల్లాయి.

ఆ కుక్కలమధ్య పోటీకి నిట్టుకోలేక, తిండిలేని, బట్టలేని, బలంలేని, భవిష్యత్తు మానవజాతి అభ్యుదయానికి మూలవిరాట్టు, గత మానవజాతి పురోగతికి వారసుడు ఏడుస్తూ అసహాయంగా ఎంగిలికుప్పఎదుట నిలబడ్డాడు!'

గోపాలం గొణుక్కొంటున్నాడు

జోగి రొప్పుతూవచ్చాడు. లోపలికిపోతూ కిచిన్వాకిట్లో ఎదురయిన వెంకటేశంతో 'మాశా!' అన్నాడు. 'ఏమిటి?', 'ఇనువరి!', 'చెప్పవే ఏమిటేమయింది?' 'అదు రిహా ఈవంటున్నాడు!'

కాఫీ సర్వ్‌చేసి విషయం వివరంగా అడిగి తెలుసుకొన్నాడు.

వీరయ్య సైకిల్‌రిక్షాల ఓనరు. అన్నిరిక్షాలు ఆ పట్టణంలో మరెవరికీలేవు. జోగికి ఆ రోజు—కారణంలేకుండా రిక్షా ఇవ్వనన్నాడు. నిజానికి కారణం లేకపోలేదు.

రెండునెలల క్రితం వీరయ్య రిక్షా అద్దె రెండున్నర నుంచి నాలుగు రూపాయలకు పెంచాడు. ఒక్కసారిగా అంత ఎక్కువగా పెంచటం అన్యాయమనీ, తగ్గించమని అడిగారు. వీల్లే దన్నాడు.

అందరూ కలిసి కలెక్టరు దగ్గరకు పోయారు. ఒలో చిస్తా నన్నాడు కలెక్టరు. 'పైసా తక్కువయినా రిక్షా ముట్టుకోవద్దు' అన్నాడు వీరయ్య. వెంకటేశం అన్యాయం అనుకొన్నాడు. కోటి, నాగలింగం, వెంకటేశం ముగ్గురూ ఒక రిక్షా రోజంతా, ఎవరికి తీరుబడిగావుంటే వాళ్ళు తొక్కుతూ వుండేవాళ్ళు.

ఒకరోజు ఎవరూ రిక్షాలు తీసుకోలేదు. రెండోరోజు మామూలువాళ్ళు తీసుకోలేదు గాని, షెడ్‌లో ఒక్క రిక్షా కూడా లేదు. రిక్షా తొక్కాలని రిక్షాలు లేక ఎంతమంది అవస్థ పడుతున్నారో తెలిసివచ్చినట్లయింది పాతవాళ్ళకు క్రొత్తవాళ్ళమీద కోపం వచ్చింది. కడుపు మండిపోయింది.

ఆకలి, పిల్లల ఏడ్పులు, భార్యల తిట్లు. పోనీ ఆ నాలుగు రూపాయలూ ఇచ్చి రిక్షా తీసుకొందామా అని కొందరు ప్రయత్నించారు. కొందరు తీసుకున్నారు. మిగిలినవాళ్ళు భరించలేకపోయారు.

ఆ రోజునుంచి వీరయ్య రిక్షాలు కనిపిస్తే, ఆపి, టూన్ ధింపారు. సీట్ కాల్చారు. బెల్లు లాగేశారు. బ్రేకులు పీకేశారు. చక్రాలు వంచేశారు. నానారోతా పట్టించారు.

కొన్ని అంగవైకల్యంతో షెడ్ చేరాయి. కొన్ని నామ రూపాలు గుర్తు తెలియకుండా అయిపోయాయి. కొన్ని రోడ్ల మీదే వుంటామని మొండికేశాయి. కొత్తవాళ్ళు పత్తా లేకుండా పోయారు.

వీరయ్య రిక్షాలన్నీ షెడ్‌లోకి తెప్పించి పోసచేసి చూసిన, పునాది కూలి పడిపోయిన విశాలభవనంలా ఉన్న కుప్ప, యుద్ధం ముగిసింతర్వాత పీనుగుల ప్రోగులాగా వున్న రిక్షాలు చూచుకొని, ఆవురుమని ఏడ్చాడు.

మళ్ళీ రిక్షాలు అన్నీ బాగుచేయించి, పూర్వం ప్రకారమే అద్దె ఇమ్మని రిక్షాలు ఇస్తుంటే వెంకటేశం జోగి లంటూ కలిసి మూడురూపాయిలు అద్దె ఇద్దామని నిశ్చయించుకొని, ఆ మాట చెబితే ఆనందించిన వీరయ్య సామాన్యుడేం కాడు.

ఇవాళ రిక్షా ఇవ్వనన్నాడంటే బలమైన కారణమే వుండాలి. మునుపు చాలా మర్యాదగా పలకరించేవాడు వీరయ్య. ఆ మధ్య ఎవరి మాటలు విన్నాడో ఏమో బాగా మారిపోయాడు. ఏరా, ఒరె, పోరె అంటున్నాడు. ఆ మొదటిలోనే అద్దె పెంచుతానని మానుకొన్నాడు

రాత్రి కోటికి రిక్షా లేదు, చెడిపోయిందని ఎవరికో ఇచ్చాడు. ఉదయం జోగికి రిక్షా ఇవ్వననీ చెప్పాడు. రేపు తనకు ఇష్టంలేనివాళ్ళు ఈ వూళ్లో రిక్షా తొక్కకూడదన వచ్చు. ఆపైన ఏమయినా అనవచ్చు. జాగ్రత్తగా వుండాలి.

వెంకటేశం జోగి మాట్లాడుకొంటుంటే గోపాలం వింటున్నాడు. వెంకటేశం చలిజ్వరంవాడిలాగా వణికిపోతున్నాడు. విలువెల్ల కంపించిపోతున్నాడు. 'ఏరా తమ్ముడూ వెంకటేశం—తొక్కేవాడిదే రిక్షా అని నినాదం ప్రారంభిస్తావేం దున్నేవాడిదే భూమి అన్నట్లుగా' పలకరించాడు గోపాలం.

వెంకటేశం ఏమీ మాట్లాడలేదు 'తొక్కేవాడిదే రిక్షా' అనుకొంటూ జోగి వెళిపోయాడు. ఉద్రిక్తమైన పరిస్థితి భరించలేకపోతున్నాడు వెంకటేశం.

రిక్షావచ్చి ఆగింది. డ్రైవర్ చెమట తుడుచుకొంటున్నాడు. సుబ్బయ్య రిక్షా దిగి, అర్ధరూపాయిబిళ్ల ఇవ్వబోయాడు. వద్దు అని రూపాయి కావాలని రిక్షాడ్రైవరు పట్టుబట్టాడు.

వెంకటేశం వచ్చి విషయం కనుక్కొంటుంటే అర్ధరూపాయి తీసుకొని వెళిపోయాడు రిక్షా డ్రైవరు. సుబ్బయ్య కృతజ్ఞతాపూర్వకంగా చూచి వెళ్లిపోయాడు. రిక్షాడ్రైవర్ వెంకటేశం కొడతాడనుకొని మాటాడకుండా వెళిపోయాడని అనుకొన్నాడు గోపాలం.

ఒకప్పుడు మనిషికి కండ బలం! ఆ తర్వాత ఎప్పుడో గుండె బలం! ఆ మధ్య ఎప్పుడో మెదడు బలం! ఇప్పుడు డబ్బు బలం!! దాన్నుంచి అన్నిబలాలు పుడతాయి. దానిలోకి అన్ని బలాలు చేరుతాయి. పరమాత్మనుంచి ఆత్మలు ఆవిర్భవించి, మళ్లీ అందులో అంతర్లీనమయినట్లు!

వెంకటేశం హాస్పటల్‌వైపు చూశాడు. ఉదయం వెళ్ళి, ఆమెను చూడకుండా తిరిగివచ్చిన పరిస్థితి గుర్తుకు తెచ్చుకొంటుంటె భయంగా వుంది. మళ్ళీ వెళదామని అనిపించింది. 'పోలేను' అనుకొని కళ్లలో తిరుగుతున్న నీళ్ళు శారదను చూచి, ఆమె చూడకుండా తుడుచుకొన్నాడు.

శారద షోకాస్ పర్సన్! గులాబి రంగు శరీరం! సన్నని ఆకారం! ఎత్తుపాటి రూపం! అందమయిన ముఖం! ఆకర్షణ ఉన్న కళ్ళు!

ఆమె స్పెషల్ గదిలోకిపోయి కూర్చుంది. వెంకటేశంవెళ్ళి ఎదుట కూర్చున్నాడు. కోటి వచ్చి 'ఏం కావాలి?' అంటే రెండు కాఫీ అని చెప్పింది శారద.

'అమ్మ రమ్మంది. అమ్మతోపాటు వూరు వెళుదామను కొంటున్నా, మీరు చెప్పి, మీరు వస్తామంటే, కలసే పోదా మని అడగటానికి వచ్చాను.

'నా కెక్కడ తీరుతుంది శారదా! రావటం కష్టం! ఇక్కడ బోలెడంత పని! నువే పోయిరా!'

'ఇక్కడేం పని, బోలెడంత పని, ఈ పనేగా! ఈ పని మానమంటే మీరు మానరు?'

శారద నిజంగా బాధపడిందనిపించింది. వెంకటేశం మౌనంగా కూర్చున్నాడు.

'ఆ నలుగురూ మీ చేత సర్వ్ చేయించుకొనే వుంటారు. అప్రయు గదా! సన్నవమానం చేయాలని వాళ్ళు!' శారద వ్యథ చెందుతూ వుంది.

'అలా ఎందుకనుకోవాలి! మొన్న నీ దగ్గర్నుంచి వస్తుంటే ఎదురుదెబ్బ తగిలి రక్తం వచ్చిందని చెప్పాను గదా! డాక్టరు రవీంద్ర నా కాలు పట్టుకొని దెబ్బచూచి తుడిచి మందువేసి, కట్టుకట్టాడు— దాని కేమనాలి. అది అతనికి అవమానం కాదు గదా!'

'అది అతని డ్యూటీ!'

'ఇది నా డ్యూటీ శారదా! ఎవడైనా తాను కోరుకొని చేస్తున్న పనిని, తన పనిని పూర్తిగా, హృదయపూర్వకంగా, సంపూర్ణంగా చేయటమే తన విధి తాను నిర్వహిం చటం! అందులో ఏమయినా లోపం వాటిల్లితే తప్పుగాని, చెడురేపోతే దోషంగాని, చేయగలిగినంతకాలం, సక్రమంగా చేస్తున్నంతకాలం, ఏ పని చేస్తున్నవాడికయినా ఆత్మతృప్తి వుంటుంది. ఈ పని ఎక్కువ, ఈ పని తక్కువ అని వెక్కెనా లేదు. నేను లెక్కా లొక్కలూ తప్పు చేస్తున్నా నని అనుకోవటంలేదు. నేను సర్వర్‌గా వుంటూ అవమానకర మయిన పని చేస్తున్నా ననుకోవటం లేదు. నువ్వు చెప్పేది ఒకటి ఒప్పుకొంటాను ఇంతకంటే సుఖంగా వుండే పని కోరుకోవచ్చును. నేను అర్హుణ్ణయినప్పుడు తప్పకుండా కోరు కుంటాను, సంపాదించుకొంటాను, భగవంతుడు వీలుకలిగిస్తే, నేను బ్రతికివుంటే! కలెక్టరయినా, డాక్టర్ అయినా సర్వరయినా, వీధి వూడ్చేవాడయినా తన పని తాను చేస్తుంటే తప్పు చేస్తున్నవాడు కాడు.'

శారద ఏమీ మాట్లాడలేదు. కోటి రెండు కాఫీలు తెచ్చాడు. ఇద్దరూ తీసుకున్నారు. 'ఏమిటో' శారద వణి కింది. కాఫీ చప్పరించింది. 'మీరు చెప్పింది, విన్నదు' కాఫీ ముగించింది. వెంకటేశం బిల్లు తీసుకొన్నాడు. 'మళ్ళీ ఎప్పుడయినా వెళదాం—బ్రతికి బాగుంటే' విచిత్రంగా నవ్వాడు. ఆమె లేచి నిలబడింది. ముఖంలోకి చూచి, 'మిమ్మల్ని చూస్తుంటే భయంగా వుంది' అంది. 'సరి సరి!' నిశా విహీనంగా నవ్వాడు వెంకటేశం. ఆమె వెళ్ళబోయింది. 'మళ్ళీ ఎప్పుడు?' అడిగాడు. 'రేపే! ఉదయమే వచ్చే స్తాను' వెళ్ళిపోతూ వినిపించీ 'శారదా! నాకోసం ఎదురు చూస్తూవుండమని కోరుకోను!' ఆమె అడుగువేయకుండా నిలబడింది. 'ఎందు కోరుకోను!— ఏమిటి మీ రిలా!' 'వెళ్ళిరా శారదా వెళ్ళిరా' ఆమె నడక సాగించింది. గొంతు బిగబోతూవుంది. ఆమె గేటుకి వెళ్ళగానే స్పెషల్ రూంలోకి పోయి, టేబిల్‌మీద తల పెట్టుకొన్నాడు. వీపు ఎగిరెగిరి పడుతూవుంది.

ఎవరు ఎవరిచేత ఎందుకు ఆకర్షింపబడతారో చెప్పటం కష్టం! వయస్సు సరదా! మాయామోహం పరిస్థితులయితే వారిని పోవచ్చు! ఒక్కొక్కప్పుడు ఎదురెక్కవచ్చు. గతి తప్ప వచ్చు. మెట్టు రెక్కవచ్చు! ఎక్కడో ఎప్పుడో ఆగిపోవచ్చు! ఇంతదూరం ఎలా వచ్చాను అని ఆలోచించినా అర్థం కాదు అంతు బట్టదు. యౌవనం విచిత్రం! వయస్సు కంటే నాళ్ళిద్దరికీ దగ్గరకు చేర్చిన శక్తి ఏముంటుంది?

శారద అందంగా వుండటంలో అంత విశేషమయినా కష్టం కాదు. కాఫీ కప్పు ఇస్తూ 'శారదగారూ, మీరు చాలా అందంగా వుంటారు' అన్నమాట ఆమె హృదయంలో చోటు చేసుకో వటం విచిత్రమే.

హాస్పిటల్‌లో పేషెంట్‌గా చేరిన వెంకటేశం మూడు రోజుల్లో శారదకు అతి సన్నిహితుడుగా మారటం, ప్రేమించు కొన్నామనుకోవటం నమ్మలేని నిజాలు! అయితే పెళ్ళి చేసు కొందా మనుకోవటం సందేహించదగ్గ సత్యం.

శారద ఒక్కతే కూతురు. అన్నలు నలుగురు. అస్తి అంతస్తు ఉన్నకుటుంబం! తండ్రి ఈ అవమానం భరించ లేక పోయాడు. మధ్యవర్తులతో రాయబారం చేశాడు, జాగ్రత్తగా వుండమని. జాగ్రత్తగా ఉన్నానని సమాధానం. భయాన ప్రారం

ంచిన సంధి నయాన సాగించాడు. కావలసినంత డబ్బు తీసుకొని, కనిపించని చోటికి పోయి, హోటల్ పెట్టుకోమని. ఏం చెప్పాలో తెలియక వెర్రిగా తిట్టి మధ్యవర్తుల్ని సాగనంపాడు వెంకటేశం.

ఒకరోజు శారద తండ్రి పరంధామయ్య వచ్చి చేతులు పట్టుకొని, అభిమానం ఉన్నవాడెవడూ, అనలేని మాటలన్నీ అని బ్రతిమాలి పూరాదిరి వెళ్ళమంటే ఎలాగో ఒప్పుకొన్నాడు వెంకటేశం.

తండ్రి చేస్తున్న ప్రయత్నాలు విని ఆత్మహత్యకు శారద ప్రయత్నించిందనీ, వారించారనీ, అందువల్లే మళ్ళీ పొమ్మంలేదనీ, ఊరు వదిలిపోతే ఆమె దక్కదనే భయంతో వూరుకొన్నారని వెంకటేశం విన్నాడు. శారదకూడా చెప్పింది. ట్రైనింగ్ నర్సింగ్ పూర్తిచేసేదాకా ఎక్కడకు పోవద్దనీ ఆ తర్వాత కలసే ఎక్కడికయినా పోవచ్చుననీ శారద చెప్పింది. అలాగే నంటే ఒట్టు వేయించుకొంది.

హాస్పటల్ టవర్‌క్లాక్ రెండుకొట్టింది. స్పెషల్ రూంలో టేబిల్‌మీద తలపెట్టుకొనివున్న వెంకటేశం ఉలిక్కిపడి లేచాడు. తూలు వచ్చినట్లుగా వుంది. కళ్ళు వాచి వున్నాయి. తడిమరకలు ముఖమంతా వున్నాయి.

బైట ఎండ! మాడిపోతూ వుంది! గాలి లేదు. ఆకయినా కదల్లాడటం లేదు. విపరీతంగ ఉక్క! చెమట! ఎంతగా ఫేన్ తిరిగినా చెమట ఆరిపోవటం లేదు. హాస్పిటల్ వైపు. ఉదయంవెళ్ళి వచ్చిన వార్డువైపు ఆశగా చూచి నిరాశగా దిగులుగా తలదాచుకొన్నాడు.

రోడ్డుమీద జనం పలచబడ్డారు. అప్పుడొకరు ఇప్పుడొకరు వస్తున్నారు పోతున్నారు. కార్లు, రిక్షాలు, సైకిళ్ళు ఎక్కువగా రావటం లేదు. లారీలు రెండో మూడో వచ్చి పోయాయి. హోటల్‌లోకి కూడా జనం ఎక్కువగా రావటం లేదు.

గోపాలం పేకర్లు అన్నీ ముగించాడు. సుబ్బారావు కేష్‌ముందు తూగుతున్నాడు. చెంగాయి, రెండు టేబుళ్ళ మధ్య గోడకు ఆనుకొని కునుకుపాట్లుపడుతూ 'అన్నా! అన్నా!' అని కలవరించి లేచి అటూ ఇటూ చూచి స్పెషల్ రూంలోంచి వెలుపలికి వస్తున్న వెంకటేశంను చూచి నిశ్చేష్టుడయి నిలబడ్డాడు.

నాగలింగం దగ్గరకు వచ్చి ముఖంలోకి చూస్తూ 'ఏమైంది? మరీ ఎట్టో అయిపోతన్నా!' అన్నాడు. చెంగాయి దగ్గరకు వచ్చాడు. ఇద్దరి ముఖాలలోకి పిచ్చిగా చూచి, తల వంచుకొన్నాడు. కళ్ళవెంట నీళ్ళు కారుతూ వున్నాయి. దిగా నోరు విప్పి, 'నాకు భయంగా వుంది!' అన్నా 'యేందన్నా యేంది?' అంటూ ఏడ్పుముఖం పెట చెంగాయి.

నాకు భయంగా వుంది అని ఎప్పుడూ వెంకటే అనటం ఎవరూ వినలేదు 'అదుగో కారు!' అన్నాడు రుగా వెంకటేశం! అది శేఖర్ కారు! రంగడు పనిచేసే హోటల్ ప్రొప్రయిటర్‌ది. అది హాస్పిటల్‌లోకి పోయింది

వెంకటేశం 'మీరు...మీరు...' చెప్పబోయి ఆగి, వ 'నన్ను–నన్ను మీరు' అని వాక్యం పూర్తి చేయకుండా కొని, 'వద్దులే?' అని ఆపివేశాడు. 'సెప్పు! యేం మంటావో సెప్పు' అన్నాడు నాగలింగం.

వెంకటేశం వళ్ళంతా విపరీతంగా చెమటతో త ముద్దయిపోతూ వుంది. కోటి వచ్చి వాళ్ళ ముగ్గుర్నీ చూ 'యేంది యీవయిం దేంది? యేం దేవీ చెప్పరు నచ్చిం దగ్గరోళ్ళలాగా! సెప్పం డేమయింది?' ఎవరూ మాటా లేదు.

రాత్రి ఫస్ట్‌షో వదిలిం తర్వాత మెయిన్ రోడ్డుమీ వస్తూ తనను వెంటాడుతున్నారెవరో అని వెంకటేశం అ మానించాడు ఫోటో స్టుడియో దగ్గరకు వచ్చేసరికి నాల ప్రక్కలా నలుగురూ వచ్చి చుట్టుకొన్నారు. భయం ఎక వయింది.

పట్టణంలో నడిరోడ్డుమీద రాత్రి పదిగంటలకే వెం టేశంను ఎటూ పోనియకుండా ఏమో చేయాలని చూస్తు వాళ్ళ దగ్గర పదునైన కత్తి కనిపించటంతో వాడుపు తప్పించుకొని, సినిమాహాలు గోడదూకి, పార్కు ప్రక్కనుం సూ్కలులోనుంచి తప్పించుకొని వచ్చాడు, వెంకటేశం.

చెప్పటం ముగించేసరికి వణుకు ఎక్కువయింది. వేప నీళ్ళు పోసినట్లు జారిపోతా వుంది.

'ఆళ్ళని గురుతు బట్ట లెవ్వేంది?'

'గుర్తుబట్టి' విచారంగా నవ్వాడు. 'ఏంచేయాలి నీళ్ళ నన్ను చంపబోయారనికదా చెప్పాల! ఎవరికి? నమ్ముతారు? నమ్మినా అది సత్యమని బుజువు చేయటం ఎలా తలవంచుకొని, 'అయినా నేను వాళ్ళను గుర్తుబట్టలేను.' దిగులుగా నవ్వి 'పేదవాడి ప్రాణం ఏం విలువ?' వెంకటేశం ఆ పెదాలు నాలుకతో తడుపుకొన్నాడు.

కోటికి ఎక్కళ్ళేని కోపం వచ్చింది. తోకతొక్కిన తాచు లాగా బుసకొడుతున్నాడు. నాగలింగం గుండెలో భయం అలలు అలలుగా లేస్తూవుంది.

'ఇక్కణ్నుంచి పారిపోతే పోలా?'

వెంకటేశం విని పిచ్చిగా తలవూపాడు. శారద దృష్టిలో మెదలింది. వెంటనే విషాదంగా నవ్వాడు. శవం నవ్వినట్లుంది.

'ఎక్కడికి పారిపోవాలి? ఎప్పుడు పారిపోవాలి? గోడలున్న ఈ హోటల్లోఅయినా దాక్కోవచ్చు. గోడల్లేని పట్టణంలో ఎక్కడ కనిపించినా—కాచుకొని వుంటారుగా—ఏముందింక?'

కోటి దురుసుగా అటూ ఇటూ తిరిగాడు. అన్యాయం అని అరిచాడు. 'మనోళ్లందర్నీ బిలుద్దాం ఈడేలి, తాడో పేడో తేలిపోవాల!'

'వద్దు! వద్దు!! వద్దు!!!—ఆ ప్రయత్నమే వద్దు! ఇప్పుడున్న పరిస్థితే మనవాళ్లకు అంతంతమాత్రం! అంతకంటే ఏం కష్టమొచ్చినా మనవాళ్లు బాధపడతారు. నాకోసం ఎవళ్లకూ కష్టం వద్దు! వాళ్లూ, వాళ్ల పిల్లలూ వాళ్ల సంసారాలూ—వాళ్లలో ఏ ఒక్కడికి ఏం కష్టమయినా అది ఆ ఒక్కడితో పోదు—నేనంటే'...ఏమీ అనకుండా ముగించాడు.

నాగలింగం భయంతో కోపంతో ఉడికిపోతున్నాడు. కోటి పట్టరాని ఆవేశంతో విసురుగా దురుసుగా దూకుడుగా ఉన్నాడు. చెంగాయి కేమీ అర్థం కాలేదు.

'అన్నా! అన్నా!!' పిలిచాడు చెంగాయి.

'ఏం రా!' ప్రేమగా పలకరించాడు వెంకటేశం.

'ఎందన్నా వీరారంతా ఎట్టాగో వుండారు?'

'ఏం లేదురా!' చెంగాయి బుగ్గ నులిమి దుఃఖం ఆపుకొంటూ, 'చూడు నువ్వా టేబిల్ క్లీన్ చేయలేదు' అని ముఖం తిప్పుకొన్నాడు.

'ఎవరో నలుగురు వచ్చారు. 'కాఫీ!' అని పిలిచారు ఎవరూ పలకలేదు కునుకుతీస్తున్న సుబ్బారావుకు మెలకువ వచ్చింది. 'వారే కోటీ! వారే నాగీ! ఏందిరా మీ ముచ్చట్లు? ఈడ కాఫీలు గావాలంటంటే యేందిరా మీ తైతెక్కలు తెండిరా కాఫీలు!' కసురుకొన్నాడు. మళ్లీ కునుకు తూగుతున్నాడు

గోపాలం వాళ్ల మాటలు కొంతలో కొంత విన్నాడు. వెంకటేశంతో 'ఒరే తమ్ముడూ! ఏమిటిరా పరిస్థితి ఘోరంగా వున్నట్లుంది' అంటే, 'అవును' అని ముఖం అవతలకు తిప్పుకొని, కిటికీలోంచి వెలుపలికి చూస్తున్నాడు.

గోపాలం బైటికి వచ్చి మురుగుకాలవలో ఉమ్మివేసి, ప్రక్కకుపోయి, సిగరెట్టుకొట్టులో సిజర్స్ ఒకటి తీసుకొని, కొబ్బెరతాడుకొసతో వెలిగించుకొని గట్టిగా పొగ పీలుస్తున్నాడు.

వెంకటేశం కిటికీలోంచి, దూరంగా రోడ్డుమీద తిరుగుతున్న బట్టనెత్తిమనిషిని చూచి, వణికిపోయి, వెనక్కు తగ్గాడు. వేగంగా హాలులోంచి గేటుదగ్గరకు వచ్చాడు. గుండె నీరసంగా కొట్టుకోసాగింది.

రోడ్డు కవతల హాస్పిటల్ గోడ ప్రక్కనే ముఖంమీద చెమట తుడుచుకొంటూ నిలబడ్డ వ్యక్తినీ, ఔట్‌గేట్ ప్రక్కనే నిలబడి సూటిగా హాస్పిటల్‌లోకి చూస్తున్న వ్యక్తినీ చూచి కిచెన్ వైపు పరుగెత్తాడు.

కిచెన్ వెనుక ఎక్కువ వెడల్పులేని వాకిలిలో వెడల్పుగా నిలిచివున్న మనిషి క్రూరంగా చూస్తున్నాడు. గబగబా హాలులోకి పరుగెత్తుకొని వచ్చాడు వెంకటేశం!

'యేమయిందేమయింది!' వంటవాళ్లు. 'యేందేంది?' సర్వర్లు. 'యేందన్నా యేది?' పని పిల్లలు, అందరూ చుట్టూ మూగారు.

కళ్లవెంట నీళ్లతో నిశ్చలంగా నిలబడి 'వాళ్లొచ్చారు!' అన్నాడు వెంకటేశం! గబగబా సుబ్బారావు దగ్గరకు పోయి, 'పోలీసుల్ని పిలుస్తా!' అని ఫోన్ అందుకొన్నాడు.

సుబ్బారావు కళ్లు నులుముకొంటూ 'పోలీసుల్నా? ఎందుకు?'

వెంకటేశం బదులు పలకలేదు. డైల్ చేశాడు. సమాధానంలేదు. మళ్లీ! జవాబు లేదు. మళ్లీ! డిటో! 'ఏందిది?' వెంకటేశం ఏడ్పుగొంతు విని సుబ్బారావు ఆశ్చర్యపోయాడు.

'పొద్దుణ్ణుంచీ లయిను సరిగ్గలేదు' ముఖం చిట్లిస్తూ ఎందుకూ అన్నట్లుగా చూశాడు సుబ్బారావు!

వెంకటేశం వణకటం లేదు, ఊగిపోతున్నాడు, పెద్దగాలికి సంచలించే తీగలాగా. అంత పెద్దశరీరం వూగుతూ అకస్మికంగా ఆగిపోయింది. ఊగటంలేదు

ఇంక తాను చేయగలిగిన ప్రయత్నం ఏదీ లేదనిపించింది' కళ్లవెంట రెండు బొట్లు రాలిపడి ఆగిపోయాయి.

'తలుపు లేస్తే!' కోటి సూచన!

'బాగానే వుంటది' నాగలింగం నమ్మకం!

వంటవాళ్లు పోయి, కిచెన్ తలుపు మూయబోయారు పనిపిల్లలు పోయి, సైడ్ ఎంట్రన్స్ మూయబోయారు. వీలుకాలేదు.

వెనుకనుంచి, ప్రక్కనుంచి తలుపులు తోసుకొని లావుపాటి మనిషి, బట్టనెత్తిమనిషి వచ్చారు.

ముందు, హాస్పటల్ గోడదగ్గర, గేటులో ఉన్న ఇద్దరూ, మెయిన్‌గేటులోంచి వచ్చారు.

లావుపాటిమనిషి రెండే దెబ్బలకు కయ్‌కుయ్‌మంటున్న కోటిని, నాగలింగంని వేలమీద పడేటట్లు కొట్టాడు.

మూల ప్రక్కలనుంచి నలుగురు తాపీగా దగ్గరకు వస్తున్నారు. కాఫీ తాగుతున్న ఎవరో ఇద్దరు లేచి పారిపోయారు.

పసిపిల్లలు పనిపిల్లలు అవురుమని ఏడుస్తున్నారు.

'వద్దు' అన్నాడు చెంగాయివైపుచూచి, వెంకటేశం. నిలుచున్న చోటినుంచి కదల్లేదు

సర్వర్ ఒకడు కుర్చీ ఎత్తాడు. వద్దని వారించాడు వెంకటేశం. అది చూచిన బట్టతలమనిషి ఆ సర్వర్‌ని బిళ్ల బీటుగా పడేటట్లు కొట్టాడు.

నలుగురులో ఇద్దరు నిశ్చలంగా ప్రశాంతంగా వచ్చి వెంకటేశం గూబ్నక్రింద చేతులువేసి పట్టుకొన్నారు.

పరమశాంతంగా వాళ్ల ముఖంలోకి చూశాడు వెంకటేశం. ఏ మాత్రం కదలలేదు. ఏ ప్రయత్నమూ చేయలేదు స్థిరంగా నిలబడి వున్నాడు నలుగుర్నీ చూస్తూ 'మీకేం అపకారం చేశాను' అంటూ హాస్పిటల్లో ఆమెవున్న వార్డువైపు చూస్తున్నాడు.

వెనుకనుంచి వచ్చిన లావుపాటి వ్యక్తి రెండు చేతులూ పిడికిలిపట్టి, ఎత్తి, ముచ్చికల గుంటమీద బలంగా కొట్టాడు 'అమ్మా!' అంటూ హాస్పిటల్ వార్డువైపు చూస్తూ క్రింద పడిపోయాడు. స్పృహ తప్పింది. వాళ్ల చేతుల్లో వాలిపోయాడు

సిగరెట్టు విసిరి నేలమీదకొట్టి, పళ్లు కొరుకుతూ 'ఏమిటీ అన్యాయం' అంటూ లోపలికి పోబోయాడు గోపాలం.

'అన్నా! అన్నా!' అరచి కేకలుపెడుతున్నాడు చెంగాయి.

గుడ్లు మిటకరించి, నోరు తెరిచి, ఊపిరి బిగబట్టి, కూర్చున్న చోటునుంచి లేవకుండా చూస్తున్నాడు సుబ్బారావు, ఉలకలేదు పలకలేదు.

స్పృహ కోల్పోయిన వెంకటేశంను చేతులమీద తీసుకు వస్తున్న వాళ్ళనలుగురినీ చూచి, 'వదలండి వాణ్ణి!' అంటూ అడ్డంపోయాడు బక్కపలచటి గోపాలం!

వాళ్లేమీ పలకలేదు. బట్టనెత్తివాడు ఒక్కనెట్టు నెట్టాడు. అంతే! గోపాలం మురుగుకాలవలో పడి, తెప్పరిల్లి, పైకిలేచి, మొలలోతు బురదలో వెలుపలికి రాలేక గింజుకొంటూ వెంకటేశంను తీసుకుపోతున్నవాళ్లను అయోమయంగా చూస్తున్నాడు.

లోపల్నుంచి 'అన్నా! అన్నా!!' చెంగాయి ఏడుస్తూ గబగబా వెలుపలికి వచ్చి, సిగరెట్టుకొట్టు పక్కనే నిలబడి చూస్తున్నాడు.

వెంకటేశంను రోడ్డు మధ్యకు లాక్కుపోయారు. హాస్పటల్‌లోనుంచి ఏదో కారువచ్చి వెళిపోయింది.

రోడ్డు మధ్యకు లాక్కుపోతున్నప్పుడు ఆ కారు హారన్ వల్ల మెలకువ వచ్చింది. స్పృహవల్ల కాళ్ళూ చేతులూ విదిలించాడు.

'పిచ్చి! పిచ్చి!!' గోపాలం కేకలు పెడుతున్నాడు.

'అన్నా! అన్నా!!' చెంగాయి ఏడుస్తున్నాడు.

ఒకడు రెండు చేతులూ గట్టిగా పట్టుకొన్నాడు. ఇంకొకడు రెండు కాళ్ళూ గట్టిగా పట్టుకొన్నాడు. నడి రోడ్డులో పడుకోబెట్టారు.

వెంకటేశం కళ్లు బాగా విచ్చుకొన్నాయి. అంతా స్పష్టంగా కనబడుతూవుంది. అది, ఎదుట, అక్కడ, అక్కణ్ణుంచి, ఎక్కడో, ఎటో దూరంగా క్షణంలో ఎండలో చల్లగా హాయిగ, స్పష్టంగా అందంగా కనిపించింది.

బట్టతలవాడు జుట్టు పట్టుకొన్నాడు. ఏ కోర్కెలో తనకు తెలియదు. హాస్పిటల్ వార్డువైపు చూపు మరలింది. వాళ్లకేమీ ద్రోహం చేయలేదు. వీళ్లకే కాదు. ఎవరికీ అకారణంగా కష్టం కలిగించలేదు.

లావుపాటివాడు పొడవైన కత్తి బైటికి తీశాడు. కళ్లు తిరుగుతున్నాయి. గొంతుమీద పెట్టాడు. వెంకటేశం చూస్తున్నాడు. 'భగవంతుడా!'

'పిచ్చి! పిచ్చి!! పిచ్చి!!!' మురుగుగుంటలోంచి గోపాలం పిచ్చిగా అరుస్తున్నాడు.

'అన్నా! అన్నా!! అన్నా!!! చెంగాయి గొంతు చించుకొంటూ ఏడుస్తున్నాడు.

అటునుంచి వచ్చే బస్సులూ లారీలు కారులు, ఇటునుంచి వచ్చేవి సడన్ బ్రేకులు వేసుకొంటూ ఆగాయి.

గొంతు మీద కత్తి చొచ్చుకు పోతూవుంది. గొంతు తెగింది.

పట్టణంలో పట్టపగలు రెండుగంటలకు నడిరోడ్డు మీద, జనం చూస్తున్నారు. వీలయిన చోటులోనుంచి జనం చూస్తున్నారు.

ఎక్కడా కదలిక లేదు. గాలిలేదు. ఆకు అల్లల్లాడటం లేదు. ఉక్క! పిచ్చిఉక్క!

కత్తి కదులుతూ వుంది. మెడనరం తెగింది. మెడ తెగింది. తల వేరయింది. బట్టతల వాడి చేతిలోకి జుట్టున్న తల వచ్చింది. తీసుకొన్నాడు, వెళిపోయారు

మొండెం లోంచి రక్తం చిమ్మంచి కొడుతూ వుంది. తొక్కి పట్టి వున్న చేతులూ కాళ్ళూ వదిలి పెట్టటంతో మొండెం మొత్తం ఎగురుతూవుంది. మొండెం ఎగిరెగిరి పడి రక్తంలో తడిసి, నాని, అంతా బురద బురద అయిపోయింది.

చెంగాయి 'అన్నా! అన్నా!! అన్నా!!!' అంటూ ఎగిరెగిరి పడుతున్న మొండెం కాళ్ళూ చేతులూ ఆపబోయి, ఆపలేక, క్రిందపడి పైకిలేచి, పడుతూ లేస్తూ, రక్తంలో తడిసి, ఎర్రగా రక్తం ముద్దయిపోయాడు.

'పిచ్చి! పిచ్చి!! పిచ్చి!!!' కేకలుపెట్టి పెట్టి, స్పృహ తప్పి మురుగు కాలవలో పడిపోయాడు గోపాలం.

అరచి, అరచి, తిరిగి, తిరిగి, ఏడ్చి ఏడ్చి, కళ్లు బైర్లు కమ్మి, చెంగాయి, ప్రాణం ఉన్న చెంగాయి, స్పృహ తప్పి, ప్రాణంలేని వెంకటేశం ప్రక్కనే పడిపోయాడు.